## విలేకరులు కావలెను

"ప్రజా శంఖారావం" తెలుగు దినపత్రికలో పని చేయుటకు తెలంగాణ రాష్ట్రంలోని జిల్లాలు మరియు మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను. తెలుగు భాషలో ప్రావీణ్యం, ప్రజా సమస్యలపై పోరాట స్ఫూర్తి, సమస్యలపై గళమెత్తగల వ్యక్తిత్వం, కలంతో ప్రశ్నించే ధైర్యం ఉన్నవారికి ఆహ్వానం పలుకుతోంది.

"ప్రజా శంఖారావం" తెలుగు దినపత్రిక.

సంప్రదించాల్సిన చిరునామా..

నిజామాబాద్ సెల్ : 9440731515



epaper.prajashankaravam.com

తెలుగు డైలీ ఈ-పేపర్

RNI NO: TELTEL/2022/85170

# ప్రజా శంఖారావం

తెలుగు దిన పత్రిక

ప్రతి అక్షరం.. ప్రజా స్వరం..

PRAJA SHANKARAVAM TELUGU DAILY

పేజీలు 8

మంగళవారం 28.07.2026 | సంపుటి: 04 | సంచిక: 74 | వెల: రూ. 3/- | ఎడిటర్: పుట్టి మురళి

హైదరాబాద్ | ఆదిలాబాద్ | నిర్మల్ | నిజామాబాద్ | కామారెడ్డి | జగిత్యాల | మంచిర్యాల | సిద్దిపేట్ | రాజన్న సిరిసిల్ల | సంగారెడ్డి | మెదక్


## రాష్ట్రంలో కుటుంబ రిజిస్టర్ సర్టిఫికెట్‌కు శ్రీకారం

- ప్రభుత్వ సేవల కోసం ఒకే ధ్రువపత్రం.. కొత్త విధానానికి తెలంగాణ సర్కార్ నిర్ణయం
- రేషన్ కార్డు ఆధారంగా ఎలక్ట్రానిక్ కుటుంబ రిజిస్టర్
- మీ-సేవ, ఆన్‌లైన్, మొబైల్ యాప్ ద్వారా దరఖాస్తు అవకాశం
- రెండు రోజుల్లో డిజిటల్ సంతకంతో ధ్రువపత్రం జారీ
- కుటుంబ సభ్యుల వివరాల ధ్రువీకరణకే సర్టిఫికెట్ వర్తింపు

హైదరాబాద్, జూలై 26:

ప్రభుత్వ పథకాలు, సేవలు పొందే సమయంలో పౌరులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను తగ్గించేందుకు తెలంగాణ ప్రభుత్వం 'కుటుంబ రిజిస్టర్ సర్టిఫికెట్' విధానాన్ని ప్రవేశపెట్టాలని నిర్ణయించింది. ఈ విధానం అమల్లోకి వస్తే కుటుంబ సభ్యుల వివరాల కోసం వేర్వేరు ధ్రువపత్రాలు సమర్పించాల్సిన అవసరం ఉండదు. కొత్త విధానం ప్రకారం ప్రస్తుతం అమల్లో ఉన్న ఆహార భద్రత కార్డు (రేషన్ కార్డు) డేటాబేస్‌తో అనుసంధానించి ఎలక్ట్రానిక్

మిగతా 2వ పేజీలో..





## హైడ్రాపై హైకోర్టు ఆగ్రహం

- కమిషనర్ రంగనాథ్‌ను తప్పించి ఐజీ స్థాయి అధికారిని నియమించాలని ప్రభుత్వానికి ఆదేశం
- కోర్టు ఉత్తర్వుల ఉల్లంఘనపై తీవ్ర వ్యాఖ్యలు
- రంగనాథ్‌పై 63 కోర్టు ధిక్కరణ పిటిషన్లు నమోదయ్యాయని ధర్మాసనం ప్రస్తావన
- పూర్తి అఫిడవిట్‌తో పాటు క్షమాపణ పత్రం దాఖలు చేసిన కమిషనర్
- చట్టబద్ధ విధానాలతోనే ఆక్రమణల తొలగింపు చేపట్టాలని హితవు


హైదరాబాద్, జూలై 26:

హైదరాబాద్ విపత్తు ప్రతిస్పందన, ఆస్తుల పరిరక్షణ ఏజెన్సీ (హైడ్రా) కమిషనర్ ఏవీ రంగనాథ్ వ్యవహార శైలిపై తెలంగాణ హైకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. మల్కాజ్‌గిరి మండలం లోతుకుంటలోని వివాదాస్పద భూముల్లో కోర్టు ఉత్తర్వులను ఉల్లంఘించి కూల్చివేతలు చేపట్టారంటూ దాఖలైన కోర్టు ధిక్కరణ పిటిషన్‌పై విచారణ జరిపిన ధర్మాసనం, హైడ్రా కమిషనర్‌గా రంగనాథ్‌ను వెంటనే తప్పించి ఆయన

మిగతా 2వ పేజీలో..

## హైడ్రా లక్ష్యం ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణే

- హైకోర్టు తీర్పుపై కమిషనర్ ఏవీ రంగనాథ్ స్పందన
- రూ.1.50 లక్షల కోట్ల ప్రభుత్వ ఆస్తులను కాపాడినట్లు వెల్లడి
- 6 చెరువుల పునరుద్ధరణ పూర్తి.. మరో 20 చెరువుల పనులు వేగంగా
- తనపై ఉన్న 63 కోర్టు ధిక్కరణ కేసులు భూకబ్జాదారులవేనని వ్యాఖ్య



హైదరాబాద్, జూలై 26:

తెలంగాణ హైకోర్టు ఇటీవల చేసిన వ్యాఖ్యలు, ఇచ్చిన ఆదేశాల నేపథ్యంలో హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ స్పందించారు. తాను రాజ్యాంగంలోని ఆర్టికల్ 21, 48ఏ స్ఫూర్తికి అనుగుణంగానే విధులు నిర్వహిస్తున్నానని, చెరువులు, పార్కులు, ప్రభుత్వ భూములను పరిరక్షించడమే హైడ్రా

మిగతా 2వ పేజీలో..



## మాజీ ఎమ్మెల్యే పెద్దికి కెసిఆర్ పరామర్శ

- యశోద ఆసుపత్రిలో మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డిని పరామర్శించిన కేసీఆర్.
- వైద్యులతో మాట్లాడి చికిత్స వివరాలు తెలుసుకుని, కుటుంబానికి ధైర్యం చెప్పిన కేసీఆర్.
- గుండెపోటు రావడంతో మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలింపు.

హైదరాబాద్, జూలై 27:

మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డిని మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పరామర్శించారు. మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డిని పరామర్శించేందుకు ఎర్రవెల్లిలోని నివాసం నుండి బయలుదేరి హైదరాబాద్‌లోని యశోద హాస్పిటల్‌కి చేరుకున్నారు. కేసీఆర్ యశోద హాస్పిటల్

మిగతా 2వ పేజీలో..



3

## పారిశ్రామికాభివృద్ధి మరింత వేగవంతం కావాలి

- మహేశ్వరం ఈ-సిటీ పార్కు సందర్శించిన సీఎస్

## విద్యార్థుల భవిష్యత్తే రాష్ట్ర భవిష్యత్తు

3

- ఉచితాలు కావు.. ప్రజా పెట్టుబడులు
- ఏ బిడ్డా అర్ధాకలితో బడికి వెళ్లొద్దు
- పాలన అంటే పెత్తనం కాదు.. సమాజ హితం
- 'పీపుల్స్ మార్చ్' నుంచే ప్రజాహిత ఇందిరమ్మ పథకాలు
- ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క



## మెట్రో ప్రయాణికులకు మెరుగైన సేవలు

- మరింత సౌకర్యవంతంగా స్టేషన్లకు రూపకల్పన
- అదనపు మేనేజింగ్ డైరెక్టర్ అజిత్ రెడ్డి



హైదరాబాద్, జూలై 27:

హైదరాబాద్ మెట్రో ప్రయాణికులకు మరింత మెరుగైన, సౌకర్యవంతమైన సేవలు అందించడమే లక్ష్యంగా హైదరాబాద్ మెట్రో రైల్ అదనపు మేనేజింగ్ డైరెక్టర్ బి. అజిత్ రెడ్డి అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. స్టేషన్లను అన్ని విధాలా

మిగతా 2వ పేజీలో..



## దర్యాప్తులో 'ఫోరెన్సిక్' నివేదికలే కీలకం

- డీజీపీ ఆనంద్
- 57 మంది ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబొరేటరీ ఉద్యోగులకు నియామక పత్రాలు

2

## కేసీఆర్ మొండి వైఖరితోనే సింగరేణికి తీరని అన్యాయం

- బొగ్గు బ్లాకుల విషయంలో నిర్లక్ష్యంతో సంస్థ వెనుకబడింది: కిషన్ రెడ్డి
- సింగరేణిని రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకున్నారని ఆరోపణ
- కొత్త బొగ్గు బ్లాకులు దక్కితే 6,500 ఉద్యోగాలు వస్తాయని వెల్లడి
- జెన్‌కో పోటీ నుంచి తప్పుకుని సింగరేణికి అవకాశం కల్పించాలని సూచన
- పేపర్ లీకేజీల నివారణకు కఠిన చట్టం తీసుకొచ్చామని స్పష్టం

2





## బంగాఖాతంలో అల్పపీడనం

- తెలంగాణ జిల్లాల్లో వర్షాలు కురిసే అవకాశం

2



## మహంకాళి బోనాలకు శ్రీధర్‌బాబుకు ఆహ్వానం

హైదరాబాద్, జూలై 27:

సికింద్రాబాద్ శ్రీ ఉజ్జయినీ మహంకాళి అమ్మవారి ఆషాఢమాస బోనాల ఉత్సవాలకు హాజరుకావాలని ఐటీ, పరిశ్రమల శాఖ

మిగతా 2వ పేజీలో..



# మెట్రో ప్రయాణికులకు మెరుగైన సేవలు

మొదటిపేజీ తరువాయి

తీర్చిదిద్దేందుకు వెంటనే ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆయన సూచించారు. ఈ మేరకు బేగంపేట్ నుంచి రాయదుర్గ్ వరకు మెట్రోలో స్వయంగా ప్రయాణించి, పలు కీలక స్టేషన్లను, అక్కడి వీధి స్థాయి వసతులను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పర్యటనలో భాగంగా బేగంపేట్, అర్ పేట్, రాయదుర్గ్ మెట్రో స్టేషన్లలోని ప్లాట్‌ఫామ్‌లు, కాంకోర్స్ ప్రాంతాలను అజిత్ రెడ్డి సందర్శించారు. అక్కడ ప్రయాణికులకు అందుతున్న సౌకర్యాలు, భద్రతా ఏర్పాట్లపై మెట్రో ఇంజనీర్లు, ఆపరేషన్ల నిర్వాహక సంస్థ కియోలిస్ అధికారులతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. రాయదుర్గ్ వద్ద ఉన్న స్కైవాక్, ఐటీ కంపెనీలకు ఉన్న కనెక్టివిటీ మార్గాలు, మైండ్‌స్పేస్ జంక్షన్ వద్ద ప్రయాణికుల రాకపోకలను ఆయన ప్రత్యేకంగా పరిశీలించారు. ఉదయం, సాయంత్రం రద్దీ వేళల్లో ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మరింత పక్కా ప్రణాళికతో ఏర్పాట్లు చేయాలని, అలాగే స్టేషన్ల కింద ఉన్న వాణిజ్య సముదాయాల నిర్వహణ సరిగ్గా ఉండేలా చూడాలని అధికారులను ఆదేశించారు. మెట్రో స్టేషన్ల కింద ఉన్న పార్కింగ్ స్థలాల వినియోగాన్ని సమర్థవంతంగా నిర్వహించాలని, బేగంపేట్, అర్ పేట్, రాయదుర్గ్ పార్కింగ్ ఏరియాలను పరిశీలించి అభివృద్ధికి తగిన సూచనలు చేశారు. అలాగే, పిల్లర్ల మధ్య ఉన్న సెంట్రల్ మెరిడియన్ నిర్వహణ , పారిశుధ్య స్థితిగతులపై ఆయన సక్షించారు. ప్రయాణికులకు ఇచ్చే సేవలలో స్వచ్ఛత, పనుల నాణ్యత విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడకూడదని స్పష్టం చేశారు. నిర్వహణ చూసే ఏజెన్సీల పనితీరును ఇంకా మెరుగుపరచాలని, నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. మెట్రో స్టేషన్లను మరింత మోడల్‌గా తీర్చిదిద్దేందుకు స్థానిక అవసరాలకు అనుగుణంగా ప్రణాళికలు రూపొందించాలని అజిత్ రెడ్డి దిశానిర్దేశం చేశారు. ఇందులో భాగంగా ప్రయోగాత్మకంగా మొదటి విడతలో 10 మెట్రో స్టేషన్లను ఎంపిక చేసి, వాటిని అన్ని రంగాల్లో సమగ్రంగా అభివృద్ధి చేయడానికి వెంటనే చర్యలు చేపట్టాలన్నారు. రాబోయే రోజుల్లో మిగిలిన అన్ని మెట్రో స్టేషన్లను కూడా స్వయంగా సందర్శించి, ప్రయాణికులకు అందే సౌకర్యాలు, పార్కింగ్, పారిశుధ్యం , భద్రతను క్రమం తప్పకుండా సమీక్షిస్తానని తెలిపారు. నగరవాసులకు అత్యంత సురక్షితమైన, ప్రశాంతమైన ప్రయాణ అనుభవాన్ని అందించడమే తమ మొదటి ప్రాధాన్యత అని ఆయన పునరుద్ఘాటించారు.

# దర్యాప్తులో 'ఫోరెన్సిక్' నివేదికలే కీలకం

హైదరాబాద్, జూలై 27:

నేరాల దర్యాప్తులో నేరస్థుడిని ఎంత కష్టపడి పట్టుకున్నా, శాస్త్రీయ ఆధారాలు, ఫోరెన్సిక్ సైన్స్ నివేదికలు పటిష్టంగా లేకపోతే కోర్టులో కేసులు బలహీనపడే అవకాశం ఉంటుందని తెలంగాణ డీజీపీ శ్రీ సి.వి. ఆనంద్, ఐపీఎస్ అన్నారు. నేర నిరూపణలో ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబొరేటరీ సిబ్బంది పాత్ర అత్యంత కీలకమని ఆయన పేర్కొన్నారు. హైదరాబాద్ నాంపల్లిలోని తెలంగాణ ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబొరేటరీ కార్యాలయంలో నూతనంగా నియమితులైన 57 మంది ఫోరెన్సిక్ ఉద్యోగులకు సోమవారం డీజీపీ నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, దేశంలో అమల్లోకి వచ్చిన నూతన క్రిమినల్ చట్టాలకు అనుగుణంగా శాస్త్రీయ దర్యాప్తు ప్రమాణాలను మరింత మెరుగుపరుచుకోవాలని సూచించారు. ఫోరెన్సిక్ నిపుణులు అందించే నివేదికలే చార్జిషీట్‌కు కోర్టులో కేసు నిరూపణలో ప్రధాన ఆధారమవుతాయని, వీటికి ప్రాధాన్యం అత్యంత ఎక్కువగా ఉంటుందని డీజీపీ తెలిపారు. శాస్త్రీయ ఆధారాలు బలంగా లేకపోతే నేరస్థులు శిక్ష నుంచి తప్పించుకునే అవకాశాలు ఉంటాయని అన్నారు. కోర్టు విచారణ విధానం, సాక్ష్యాలను ప్రవేశ పెట్టడంలో , కొత్త చట్టాల ప్రకారం పాటించాల్సిన నిబంధనలపై పూర్తి అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. ప్రతి ఫోరెన్సిక్ నివేదిక అత్యంత నాణ్యతతో, నిర్దిష్ట ప్రమాణాలకు అనుగుణంగా ఉండాలని చెప్పారు. పెరుగుతున్న నేరాలకు అనుగుణంగా ప్రస్తుతం ఫోరెన్సిక్ సిబ్బంది సంఖ్యను మరింత పెంచాల్సిన అవసరం ఉందన్నారు. అలాగే అవసరమైన ఆధునిక పరికరాలు, కెమికల్స్, ఇతర మెటీరియల్‌ను సమకూర్చేందుకు కృషి చేస్తామని చెప్పారు. నూతనంగా నియమితులైన 57 మందిలో 36 మంది పీహెచ్‌డీ, 15 మంది ఎంటెక్ పట్టభద్రులు ఉండటం సంతోషకర విషయమని డీజీపీ పేర్కొన్నారు. వారి విద్యార్హతలు ఫోరెన్సిక్ విభాగ సామర్థ్యాన్ని మరింత పెంచుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు .ఈ సందర్భంగా హోంశాఖ ముఖ్య కార్యదర్శి & టీజీఎఫ్ఎస్ఎల్ డైరెక్టర్ శిఖా గోయల్ మాట్లాడుతూ.. పరిమిత సిబ్బందితోనే ఫోరెన్సిక్ ల్యాబ్ 80 శాతానికి పైగా కేసులను పరిష్కరిస్తోందన్నారు. దేశంలో అత్యధికంగా ఫోరెన్సిక్ నివేదికలను అందిస్తున్న రాష్ట్రాల్లో తెలంగాణ ఒకటిగా నిలిచిందని తెలిపారు. 2025లో మొత్తం 18,647 కేసులను పరిష్కరించి 86 శాతం డిస్పోజల్ రేటు నమోదు చేసినట్లు చెప్పారు. ప్రాధాన్య కేసుల్లో నిర్ణీత గడువులోనే ఫోరెన్సిక్ నివేదికలు అందజేస్తున్నామని వివరించారు. డీఎన్ఏ విశ్లేషణ, కంప్యూటర్ ఫోరెన్సిక్స్, నార్కోటిక్స్, టాక్సికాలజీ తదితర విభాగాల్లో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో సేవలు అందిస్తున్నామని తెలిపారు. డిజిటల్ సాక్ష్యాల పరిశీలన, మాదకద్రవ్యాల కేసుల పెరుగుదలను దృష్టిలో ఉంచుకొని ల్యాబ్‌ను మరింత ఆధునికీకరిస్తున్నామని చెప్పారు. అంతర్జాతీయ సంస్థలతో కలిసి పరిశోధనలు, శిక్షణ కార్యక్రమాల్లో పాల్గొంటూ గుర్తింపును కొనసాగిస్తున్నట్లు పేర్కొన్నారు. కొత్తగా నియమితులైన 57 మంది సైంటిఫిక్ ఆఫీసర్స్ లో 36 మంది పీహెచ్‌డీలు, 12 మంది ఎంఎస్సీ, ఆరుగురు ఎం.టెక్, ముగ్గురు ఎంసీఏ పట్టభద్రులు ఉన్నారు. వీరి నియామకంతో ల్యాబ్ సామర్థ్యం మరింత పెరిగి, పోలీసు శాఖకు శాస్త్రీయ ఆధారాలతో కూడిన వేగవంతమైన ఫోరెన్సిక్ సేవలు అందనున్నాయని అధికారులు తెలిపారు. టీజీఎఫ్ఎస్ఎల్‌కు ఎన్ఏబీఎల్ గుర్తింపు లభించగా, సమాచార సాంకేతిక చట్టం-2000లోని సెక్షన్ 79ఏ కింద ఎలక్ట్రానిక్ సాక్ష్యాల ప్రభుత్వ పరీక్షా సంస్థగా గుర్తింపు పొందింది. 57 మంది శాస్త్రీయ సిబ్బంది నియామకంతో తెలంగాణలో ఫోరెన్సిక్ సామర్థ్యాలు మరింత బలోపేతమై, నేరాల దర్యాప్తు వేగవంతం కానుందని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబొరేటరీ జాయింట్ డైరెక్టర్లు మధుశ్రీ, రవికుమార్ గౌడ్, దార్మిత, అసిస్టెంట్ డైరెక్టర్లు తో పాటు ఉన్నతాధికారులు, తెలంగాణ పోలీస్ శాఖ అధికారులు, నూతనంగా నియమితులైన ఉద్యోగులు పాల్గొన్నారు.



# హైడ్రా లక్ష్యం ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణే

మొదటిపేజీ తరువాయి

ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. గత రెండేళ్లలో మార్కెట్ విలువ ప్రకారం సుమారు రూ.1.50 లక్షల కోట్ల ప్రభుత్వ ఆస్తులను ఆక్రమణల నుంచి విడిపించి తిరిగి ప్రభుత్వానికి అప్పగించినట్లు వెల్లడించారు. నిజాయితీ, నిబద్ధతతో పనిచేస్తున్నందుకే ధైర్యంగా ముందుకు సాగుతున్నామని పేర్కొన్నారు.

హైడ్రా చర్యలతో నగరంలోని ప్రభుత్వ భూములు, చెరువులు, పార్కులు పెద్దఎత్తున రక్షించబడుతున్నాయని రంగనాథ్ తెలిపారు. ఇప్పటికే ఆరు చెరువులను పూర్తిస్థాయిలో పునరుద్ధరించామని, మరో 20 చెరువుల అభివృద్ధి పనులు వేగంగా కొనసాగుతున్నాయని చెప్పారు. ఆక్రమణదారుల చేతుల్లో ఉన్న వందల చెరువులు, పార్కులు, వేల ఎకరాల ప్రభుత్వ భూములను తిరిగి స్వాధీనం చేసుకున్నామని పేర్కొన్నారు. లోతుకుంట భూవివాదంపై స్పందించిన ఆయన, ల్యాండ్ మాఫియా తప్పుడు సమాచారంతో న్యాయస్థానాలను తప్పుదోవ పట్టిస్తోందని ఆరోపించారు. లోతుకుంటలో సుమారు రూ.10 వేల కోట్ల విలువైన 120 ఎకరాల ప్రభుత్వ భూమిని ఒక రియల్ ఎస్టేట్ సంస్థ ఆక్రమించేందుకు ప్రయత్నించిందని అన్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా వందల ఏళ్ల నాటి వారసత్వ గుట్టలను పేలుళ్లతో ధ్వంసం చేస్తూ చెట్లను నరికివేశారని విమర్శించారు. పర్యావరణ సంస్థలు, స్థానికుల ఫిర్యాదుల మేరకే హైడ్రా చర్యలు చేపట్టిందని తెలిపారు.

తనపై నమోదైన 63 కోర్టు ధిక్కరణ కేసులన్నీ భూకబ్జాదారులు, ల్యాండ్ మాఫియా దాఖలు చేసినవేనని రంగనాథ్ పేర్కొన్నారు. ప్రభుత్వ భూములు, చెరువులు, సామాన్యుల ఆస్తులను కాపాడే క్రమంలోనే ఈ కేసులు ఎదుర్కొంటున్నానని చెప్పారు. అన్ని కేసులను చట్టపరంగానే ఎదుర్కొంటానని, న్యాయవ్యవస్థపై తనకు పూర్తి విశ్వాసం ఉందని స్పష్టం చేశారు. భవిష్యత్తులో ప్రభుత్వం ఎలాంటి బాధ్యతలు అప్పగించినా పూర్తి నిబద్ధతతో నిర్వర్తిస్తానని రంగనాథ్ తెలిపారు. చట్టపరిధిలోనే పనిచేస్తూ నగరంలోని పర్యావరణం, ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణ కోసం హైడ్రా చర్యలను కొనసాగిస్తుందని ఆయన పునరుద్ఘాటించారు.

# హైడ్రాపై హైకోర్టు ఆగ్రహం

మొదటిపేజీ తరువాయి



స్థానంలో ఐజీ స్థాయి ఐపీఎస్ అధికారిని నియమించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. లోతుకుంట సర్వే నంబర్లు 1, 2 పరిధిలోని 40 ఎకరాల భూవివాదానికి సంబంధించి శాంతా శ్రీరామ్ కన్‌స్ట్రక్షన్స్ దాఖలు చేసిన పిటిషన్‌ను విచారించిన హైకోర్టు, ఒకే అధికారిపై ఏకంగా 63 కోర్టు ధిక్కరణ పిటిషన్లు నమోదవడం ఆందోళనకరమని వ్యాఖ్యానించింది. కేవలం ప్రభుత్వ ఉత్తర్వుతో ఏర్పాటైన ఏజెన్సీ సివిల్ కోర్టులు, హైకోర్టు ఇచ్చిన స్టే ఉత్తర్వులను పక్కనపెట్టి చర్యలు చేపట్టడం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని స్పష్టం చేసింది. విచారణ అనంతరం హైడ్రా కమిషనర్ రంగనాథ్ కోర్టు ఆదేశాల మేరకు పూర్తి అఫిడవిట్ దాఖలు చేశారు. అందులో క్షమాపణ పత్రాన్ని జతచేస్తూ, న్యాయవ్యవస్థపై తనకు పూర్తి గౌరవం ఉందని, కోర్టు ఆదేశాలను ఉద్దేశపూర్వకంగా ధిక్కరించే ఉద్దేశం లేదని పేర్కొన్నారు. పిటిషనర్ ఆరోపించినట్లుగా వివాదాస్పద 40 ఎకరాల భూమిలోకి తాము ప్రవేశించలేదని, వాస్తవాలను దాచిపెట్టి కోర్టును తప్పుదోవ పట్టించేందుకు ప్రయత్నించారని అఫిడవిట్‌లో వివరించారు. చెరువుల పరిరక్షణ, ఆక్రమణల తొలగింపు వంటి హైడ్రా లక్ష్యాలు సమర్థనీయమైనవేనని పేర్కొన్న హైకోర్టు, వాటి అమలులో రాజ్యాంగబద్ధమైన విధానాలు తప్పనిసరిగా పాటించాలని స్పష్టం చేసింది. పోలీసు, రెవెన్యూ, జీహెచ్ఎంసీ యంత్రాంగం మొత్తం హైడ్రా నిర్ణయాలపైనే ఆధారపడటం సరికాదని, చట్టం ముందు అందరూ సమానులనే సూత్రాన్ని అధికారులు గుర్తుంచుకోవాలని సూచించింది. రాజ్యాంగబద్ధమైన జవాబుదారీతనం, పారదర్శకతను బలోపేతం చేయడానికి ఐజీ స్థాయి అధికారికి హైడ్రా బాధ్యతలు అప్పగించడమే సముచితమని ధర్మాసనం అభిప్రాయపడింది.

# బంగాఖాతంలో అల్పపీడనం

హైదరాబాద్, జూలై 27 :



బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో తెలంగాణలో వచ్చే నాలుగు నుంచి ఐదు రోజుల పాటు విస్తారంగా వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ తెలిపింది. రాష్ట్రంలోని పలు జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హెచ్చరించింది. లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. ఐఎండీ అంచనాల ప్రకారం సోమవారం రాష్ట్రంలోని ఉత్తర, తూర్పు తెలంగాణ జిల్లాలైన ఆదిలాబాద్, కుమురం భీం ఆసిఫాబాద్, నిర్మల్, మంచిర్యాల, జగిత్యాల, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్, ఖమ్మం జిల్లాల్లో మధ్యాహ్నం తర్వాత నుంచి రాత్రి వరకు మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. అదేవిధంగా నిజామాబాద్, కామారెడ్డి, సంగారెడ్డి, వికారాబాద్, మెదక్, మహబూబ్‌నగర్, రంగారెడ్డి, సిద్దిపేట, జనగామ, కరీంనగర్, హనుమకొండ, వరంగల్, నారాయణపేట జిల్లాల్లో విస్తారంగా మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. మిగతా జిల్లాల్లో అక్కడక్కడా చిరుజల్లులు నుంచి తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. భారీ వర్షాల కారణంగా లోతట్టు ప్రాంతాలు జలమయం కావడం, వాగులు, వంకలు పొంగిపొర్లడం, రహదారులపై నీరు నిలిచి రాకపోకలకు అంతరాయం ఏర్పడే అవకాశముందని ఐఎండీ హెచ్చరించింది. అత్యవసర పరిస్థితులు మినహా వరద ప్రవాహాలు ఉన్న ప్రాంతాలకు వెళ్లొద్దని, ప్రజలు వాతావరణ శాఖ సూచనలను పాటిస్తూ అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. వాయవ్య బంగాళాఖాతం దానికి ఆనుకొని ఉన్న ఉత్తర ఒడిశాపశ్చిమ బెంగాల్ తీర ప్రాంతాలపై ఏర్పడిన అల్పపీడనం ఆదివారం వాయుగుండంగా మారిందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. ఇది రాబోయే 24 గంటల్లో తీవ్ర వాయుగుండంగా బలపడే అవకాశం ఉన్నదని పేర్కొన్నది. ఈ వాయుగుండం సోమవారం పారాదీప్‌సాగర్ ద్వీపాల మధ్య ఉత్తర ఒడిశా, పశ్చిమ బెంగాల్ తీరాలను దాటుతుందని వెల్లడించింది. దీని ప్రభావంతో 31వరకు రాష్ట్రవ్యాప్తంగా అక్కడక్కడ ఉరుములు, మెరుపులు, పిడుగులతోపాటు కూడిన వర్షాలు కురుస్తాయని వివరించింది. కాగా, జూలైలో రాష్ట్రంలో 43శాతం లోటు వర్షపాతం నమోదైనట్టు హైదరాబాద్ వాతావరణ కేంద్రం పేర్కొన్నది. సాధారణ సగటు వర్షపాతం 227.4 మి. కురువాల్సి ఉండగా, 109.7 మి. కురిసిందని తెలిపింది.

# మహంకాళి బోనాలకు శ్రీధర్‌బాబుకు ఆహ్వానం

మొదటిపేజీ తరువాయి

మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబును ఆలయ పాలకమండలి సభ్యులు ఆహ్వానించారు. సచివాలయంలో మంత్రిని సోమవారం కలిసిన పాలకమండలి ప్రతినిధులు ఆహ్వాన పత్రికను అందజేశారు. ఆగస్టు 2న జరిగే బోనాల ఉత్సవం, 3న నిర్వహించే రంగం, ధ్వజారోహణ కార్యక్రమాల్లో పాల్గొనాలని కోరారు. ఈ సందర్భంగా ఈవో మనోహర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు రామతీర్థ శర్మ, వేణుమాధవ శర్మ వేద మంత్రోచ్చారణలతో మంత్రిని ఆశీర్వదించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు దేవీవరప్రసాద్, మంత్రి సోనాల్, మల్లికార్జున్, గంటా గీత, కిరణ్ ముప్పిడి తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రంలో కుటుంబ రిజిస్టర్ సర్టిఫికెట్‌కు శ్రీకారం

మొదటిపేజీ తరువాయి

కుటుంబ రిజిస్టర్‌ను నిర్వహించనున్నారు. రేషన్ కార్డు సంఖ్యనే కుటుంబ రిజిస్టర్ గుర్తింపు సంఖ్యగా పరిగణిస్తారు. ఇందులో కుటుంబ పెద్ద పేరు, సభ్యుల వివరాలు, వయస్సు, చిరునామా వంటి సమాచారం నమోదై ఉంటుంది.

ఈ సర్టిఫికెట్ కోసం మీసేవ కేంద్రాలు, ఆన్‌లైన్ పోర్టల్ లేదా మొబైల్ యాప్ ద్వారా దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించనున్నారు. కుటుంబంలోని ఏ వయోజన సభ్యుడైనా దరఖాస్తు సమర్పించవచ్చు. తహసీల్దార్ రేషన్ కార్డు డేటాతో వివరాలను పరిశీలించిన అనంతరం రెండు రోజుల్లో డిజిటల్ సంతకంతో కూడిన కుటుంబ రిజిస్టర్ సర్టిఫికెట్ జారీ చేస్తారు.

అయితే ఈ ధ్రువపత్రం కేవలం కుటుంబ సభ్యుల వివరాల నిర్ధారణ కోసం మాత్రమే ఉపయోగపడుతుందని అధికారులు స్పష్టం చేశారు. దీని ద్వారా ఆస్తి హక్కులు, చట్టబద్ధ వారసత్వ హక్కులు లేదా ప్రభుత్వ పథకాల అర్హత స్వయంగా లభించదని పేర్కొన్నారు. కొత్త విధానం ద్వారా ప్రభుత్వ సేవల కోసం అవసరమైన ధ్రువపత్రాల ప్రక్రియ మరింత సులభతరం కానుందని అధికారులు భావిస్తున్నారు.

# మాజీ ఎమ్మెల్యే పెద్దికి కెసిఆర్ పరామర్శ

మొదటిపేజీ తరువాయి

వైద్యులతో మాట్లాడి పెద్ది సుదర్శన్ రెడ్డి ఆరోగ్య పరిస్థితిని, ఆయనకు అందుతున్న చికిత్స వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పెద్ది సుదర్శన్ రెడ్డి కుటుంబసభ్యులను పరామర్శించారు. పెద్ది కుటుంబసభ్యులకు కేసీఆర్ మనోధైర్యాన్ని అందించారు. కేసీఆర్ వెంట బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీష్‌రావు, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి సత్యవతి రాథోడ్, మాజీ ఎంపీ జోగినపల్లి సంతోష్ కుమార్, మాజీ మంత్రి, ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డితో పాటు పలువురు పార్టీ నాయకులు ఉన్నారు. రెండు రోజుల క్రితమే యశోద హాస్పిటల్‌లో వైద్య పరీక్షలు చేయించుకున్న పెద్దికి ఆదివారం హనుమకొండలోని ఇంట్లో ఉదయం 7 గంటలకు తీవ్రమైన గుండెపోటు రాగా ఆయన భార్య స్వప్న వెంటనే దగ్గరలోని రోహిణి హాస్పిటల్‌కు తీసుకెళ్లారు. కార్డియాలజిస్ట్ మమతారెడ్డి నేతృత్వంలో వైద్యుల బృందం వేగంగా స్పందించి అత్యవసర వైద్యం అందించారు. అత్యవసర సీపీఆర్ అనంతరం మెరుగైన వైద్యం కోసం పెద్ది సుదర్శన్ రెడ్డిని గ్రీన్ ఛానల్ ద్వారా హైదరాబాద్‌లోని యశోద హాస్పిటల్‌కు తరలించారని తెలిసిందే.

# కేసీఆర్ మొండి వైఖరితోనే సింగరేణికి తీరని అన్యాయం

హైదరాబాద్, జూలై 26:

మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ మొండి వైఖరి, తప్పుదోవ పట్టించిన నిర్ణయాల వల్లే సింగరేణి సంస్థకు తీరని అన్యాయం జరిగిందని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి విమర్శించారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు బొగ్గు గనులను పారదర్శక వేలం ద్వారా కేటాయించే అవకాశం ఉన్నప్పటికీ, అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం ఆ ప్రక్రియలో పాల్గొనకపోవడంతో సింగరేణి కొత్త బొగ్గు బ్లాకులను కోల్పోయిందన్నారు. ఫలితంగా సంస్థ విస్తరణ అవకాశాలు దెబ్బతిన్నాయని, ఆదాయ వనరులు తగ్గిపోయాయని ఆరోపించారు. కేంద్రం అందించిన రూ.525 కోట్ల నిధులను కూడా సక్రమంగా వినియోగించలేకపోయారని విమర్శించారు.

ఒడిశాలోని నైని కోల్ బ్లాక్‌ను 2015లోనే కేంద్ర ప్రభుత్వం సింగరేణికి కేటాయించినప్పటికీ, అప్పటి రాష్ట్ర ప్రభుత్వం అవసరమైన చర్యలు తీసుకోలేదని కిషన్ రెడ్డి అన్నారు. ఒడిశాలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కేంద్రం చొరవతో అన్ని అనుమతులు ఇప్పించిందని తెలిపారు. అలాగే తాడిచర్ల2 బొగ్గు బ్లాక్‌ను కూడా సింగరేణికి కేటాయించామని, మణుగూరులోని మరో బొగ్గు బ్లాక్‌ను వేలంలో ఉంచినట్లు వెల్లడించారు.

మణుగూరు బొగ్గు బ్లాక్ వేలంలో తెలంగాణ జెన్‌కో సింగరేణికి పోటీగా పాల్గొనడంపై ఆయన అభ్యంతరం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం జెన్‌కోను టెండర్ ప్రక్రియ నుంచి తప్పించి, ఆ బ్లాకులు సింగరేణికి దక్కేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కోరారు. ఈ విషయమై సీఎంకు లేఖ రాయనున్నట్లు తెలిపారు. మూడు కొత్త బొగ్గు బ్లాకులు సింగరేణికి లభిస్తే సుమారు 6,500 మందికి ఉపాధి అవకాశాలు కలుగుతాయని, 830 మిలియన్ మెట్రిక్ టన్నుల బొగ్గు ఉత్పత్తితో దాదాపు రూ.1.95 లక్షల కోట్ల టర్నోవర్ సాధించే అవకాశం ఉందని పేర్కొన్నారు.

పబ్లిక్ పరీక్షల చట్టంపై స్పందించిన కిషన్ రెడ్డి, పేపర్ లీకేజీలను పూర్తిగా అరికట్టే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం 2024లోనే కఠిన చట్టాన్ని తీసుకొచ్చిందన్నారు. భవిష్యత్తులో ఎవరూ పేపర్ లీక్‌లకు పాల్పడలేని విధంగా కఠిన శిక్షలను ఇందులో పొందుపరిచామని చెప్పారు. విద్యా వ్యవస్థలో పారదర్శకత కోసం తీసుకొచ్చిన ఈ చట్టానికి సహకరించాల్సింది పోయి కాంగ్రెస్ అడ్డంకులు సృష్టించడం బాధాకరమన్నారు.

పరీక్షల ఫలితాల తర్వాత కొంతమంది విద్యార్థులు నిరాశతో ఆత్మహత్యలకు పాల్పడుతున్న ఘటనలు ఆందోళన కలిగిస్తున్నాయని, వారిలో ఆత్మవిశ్వాసం నింపాల్సిన బాధ్యత సమాజంపై ఉందని కిషన్ రెడ్డి పేర్కొన్నారు. ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద జరిగిన ఘటనపై ప్రస్తుతం సుప్రీంకోర్టు విచారణ కొనసాగుతోందని, న్యాయ ప్రక్రియపై పూర్తి విశ్వాసం ఉందన్నారు.

# విద్యార్థుల భవిష్యత్తే రాష్ట్ర భవిష్యత్తు

**మధిర, జూలై 27 :**

ఉచిత పథకాలు అనేవి ఈ రాష్ట్ర ప్రజలపై ప్రభుత్వం పెట్టే పెట్టుబడి అని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్పష్టంగా ప్రకటించారు. మిడిమిడి జ్ఞానంతో చాలామంది ఉచిత పథకాలపై విమర్శలు చేస్తున్నారని తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. పరిశ్రమలు, ప్రాజెక్టులు, ఇతర అనేక అంశాలపై ప్రభుత్వం పెట్టుబడి పెట్టినట్లుగానే పేదలు, దళితులు, వెనుకబడిన వర్గాలు సహా రాష్ట్రవ్యాప్తంగా ప్రజలందరిపై ప్రభుత్వం పెట్టుబడి పెడుతుందని అన్నారు. ఈ పెట్టుబడి ఫలితాలు ప్రజలు అభివృద్ధి చెంది ఆర్థికంగా, సామాజికంగా ముందుకు వెళ్లేందుకు దోహదం చేసేవిగా ఉంటాయన్నారు. మధిర నియోజకవర్గ కేంద్రంలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు పోషకాహార అల్పాహారాన్ని అందించే సెంట్రలైజ్డ్ కమ్యూనిటీ కిచెన్ సెంటర్ ను ఆయన సోమవారం ప్రారంభించారు. అనంతరం బహిరంగ సభలో మాట్లాడుతూ రాష్ట్రంలోని ఏ బిడ్డా కూడా అర్ధాకలితో పాఠశాలకు వెళ్లకూడదన్నదే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ ప్రధాన ఆశయమని పేర్కొన్నారు. విద్యార్థుల భవిష్యత్తే రాష్ట్ర భవిష్యత్తు అని, ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ పిల్లల శారీరక, మానసిక వికాసం కోసం ఉదయమే రుచికరమైన, శుచిశుభ్రతతో కూడిన పౌష్టికాహారాన్ని అందించేందుకు ప్రజాప్రభుత్వం శ్రీకారం చుట్టిందని తెలిపారు. బడ్జెట్ లో ప్రకటించిన విధంగానే రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఉచిత అల్పాహార పథకాన్ని మధిర నియోజకవర్గంలో ప్రారంభించినట్లు చెప్పారు. ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ ఉదయంపూట సంతృప్తికరంగా బ్రేక్ ఫాస్ట్ చేసి బిడ్డలు చక్కగా చదువుకోవాలనే ఉద్దేశంతో రుచికరమైన, శుచిశుభ్రతతో కూడిన న్యూట్రిషియస్ ఫుడ్ అందించాలని తమ కేబినెట్ నిర్ణయం మేరకు బడ్జెట్ లో ఈ పథకాన్ని ప్రవేశపెట్టామని చెప్పారు. అర్ధాకలితో పాఠశాలకు వచ్చి అధ్యాపకులు చెప్పే పాఠాలను సరిగ్గా వినలేక, ఆకలితో సతమతమవుతూ చదువు మీద దృష్టి పెట్టలేని పరిస్థితి ఏ విద్యార్థికీ రాకూడదనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. ఏ రాష్ట్ర అభివృద్ధికైనా సహజ వనరులు ఎంత అవసరమో సమర్థవంతమైన మానవ వనరులు కూడా అంతే అవసరమని భట్టి విక్రమార్క వక్కాణించారు. అత్యంత ప్రతిభావంతులుగా తయారైన మానవ వనరులు ఉన్న రాష్ట్రం గాని, దేశం గాని ప్రపంచంలో అత్యంత శక్తివంతంగా మారుతుందని అన్నారు. వజ్రాల్ని తయారు చేసుకోవాల్సిన తరుణంలో మార్నింగ్ బ్రేక్ ఫాస్ట్ పథకాన్నిరాష్ట్ర వ్యాప్తంగా తలపెట్టే కార్యక్రమానికి నాంది పలికామని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా 27 లక్షల మంది విద్యార్థులకు ఒకటే సమయానికి వేడిగా అల్పాహారం అందించడం అంటే ఇది ఒక చరిత్రాత్మకమైన నిర్ణయం.. ఈ దేశ చరిత్రలోనే సువర్ణాక్షరాలతో లెక్కించాల్సిన అంశం అని చెప్పారు. ఏ దేశంలోనూ, ఏ రాష్ట్రంలోనూ ఇంత పెద్ద ఎత్తున అల్పాహారం అందించే వ్యవస్థ లేదని భట్టి పేర్కొన్నారు. సంకల్పం మంచిదైతే భగవంతుని ఆశీస్సులు ఉంటాయని, అందుకే సాధ్యం కాదనుకున్న ఈ కార్యక్రమాన్ని ప్రజాప్రభుత్వం సాధ్యం చేసి చూపిందని డిప్యూటీ సీఎం తెలిపారు. హరే కృష్ణ మిషన్ భాగస్వామ్యంతో పకడ్బందీగా, అత్యంత శుభ్రమైన వాతావరణంలో మెకనైజ్డ్ కిచెన్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రస్తుతం మధిరలోని తాత్కాలిక సెంట్రలైజ్డ్ కిచెన్ ద్వారా 16 మండలాల స్కూళ్లకు వాహనాల్లో అల్పాహారం అందిస్తున్నామన్నారు. రాబోయే మ□డు నెలల్లో రాష్ట్రవ్యాప్తంగా శాశ్వత కిచెన్ నిర్మాణాలను పూర్తి చేసి విద్యార్థులకు అల్పాహారాన్ని అందించనున్నట్లు భట్టి విక్రమార్క చెప్పారు. పిల్లలకు అందించే అల్పాహారంతో పాటు పౌష్టికాహారం కోసం వారానికి మ□డు రోజులు పాలు, మరో మ□డు రోజులు రాగి జావను ప్రత్యేకంగా అందిస్తున్నట్లు వెల్లడించారు. బడి పిల్లలతో కలిసి భోజనం చేయడం తన రాజకీయ జీవితంలో ఎన్నడూ లేనంత తృప్తిని ఇచ్చిందని ఆనందం వ్యక్తం చేశారు. పాలన అంటే ఒక హోదా కాదు. అధికారం అంటే పెత్తనం చలాయించడం కాదు.. అధికారమన్నా, పాలనన్నా ఉన్న వనరుల్ని పోగేసి సమాజ హితం కోసం ప్రణాళికలు తయారు చేయడం.. వారి అభివృద్ధికి పునాదులు వేయడం అని చెప్పారు. అందులో భాగంగానే రాష్ట్రవ్యాప్తంగా ఇల్లు లేని వారి కోసం రూ.5 లక్షలతో ఒక్కొక్క ఇందిరమ్మ ఇల్లు నిర్మాణం జరుగుతున్నదన్నారు. గృహ ప్రవేశానికి మనం వెళ్లినప్పుడు ఆ పేదవాళ్ల కళ్లల్లో ఆనందం చూస్తే ఇది కదా పాలన అనే అనుభూతి కలుగుతోందన్నారు. ఆదిలాబాద్ నుంచి ఖమ్మం వరకు తాను చేసిన పీపుల్స్ మార్చ్ పాదయాత్రలో ప్రజలు పడుతున్న కష్టాలను కళ్లారా చూశానని భట్టి చెప్పారు. ఆ సమయంలో బడుల దుస్థితి, నిరుద్యోగుల ఆవేదన, ఇల్లు లేని పేదల బాధలను విన్నానని చెప్పారు. ఆనాడే తన మనసులో రూపుదిద్దుకున్న ఆలోచనలే నేడు ఒక్కొక్కటిగా పథకాలుగా మారుతున్నాయని భావోద్వేగానికి లోనవుతూ ఉప ముఖ్యమంత్రి చెప్పారు.

**ప్రజల జీవితాల్లో మార్పే**
**ఇందిరమ్మ ప్రభుత్వ లక్ష్యం**

విధానపరమైన నిర్ణయాలతో ప్రజల జీవితాల్లో గుణాత్మక మార్పు తీసుకురావడమే ప్రభుత్వ ధ్యేయమని స్పష్టం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఒకేసారి 4.50 లక్షల ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసి వాటి నిర్మాణానికి రూ.22,500 కోట్ల నిధులు విడుదల చేశామని తెలిపారు. ఇళ్ల నిర్మాణ కార్యక్రమం ప్రారంభించడం తన రాజకీయ జీవితంలో అత్యంత సంతృప్తినిచ్చిన నిర్ణయమని అన్నారు. పభుత్వ పాఠశాలల్లో చదివే పేద, బలహీనవర్గాల విద్యార్థులకు ఉదయం అల్పాహారం, ఇంటర్మీడియట్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందిస్తున్నామని చెప్పారు. రైతు భరోసాతో లక్షలాదిమంది రైతుల ఖాతాల్లో రూ.9,000 కోట్లు జమ చేయడం ఎంతో ఆనందాన్ని ఇచ్చిందని తెలిపారు. మహిళలను మహాలక్ష్ములుగా గౌరవిస్తూ ఆర్టీసీ ఉచిత బస్సు ప్రయాణం ద్వారా వారికి ఆర్థిక భారం తగ్గించామని పేర్కొన్నారు. మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయాలనే లక్ష్యంతో ఏడాదికి రూ.20,000 కోట్ల వడ్డీ లేని రుణాలు అందిస్తామని ఇచ్చిన హామీని అమలు చేస్తున్నామని తెలిపారు. ఇప్పటికే రెండున్నరేళ్లలో రూ.67,000 కోట్ల బ్యాంక్ లింకేజ్ రుణాలు అందించామని, ఐదేళ్లలో ఈ మొత్తం రూ.లక్ష కోట్లకుపైగా చేరేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ప్రతీ కుటుంబానికి ఏడాదికి రూ.10 లక్షల వరకు ఉచిత వైద్య సేవలు అందించేలా రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకాన్ని రాష్ట్రవ్యాప్తంగా అమలు చేస్తున్నామని వెల్లడించారు. రాష్ట్రంలోని ప్రతి కుటుంబం నాణ్యమైన సన్న బియ్యం తినాలనే లక్ష్యంతో కోటి 6 లక్షల కుటుంబాలకు ప్రతి సభ్యునికి 6 కిలోల చొప్పున సన్న బియ్యం పంపిణీ చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో హరే కృష్ణ మూవ్‌మెంట్ చారిటబుల్ ఫౌండేషన్ అధ్యక్షుడు సత్య గౌరచంద్ర దాస ప్రభుజీ, ఫౌండేషన్ సీఈవో కౌంతేయ స్వామీజీ, వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్, జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్, కార్పొరేషన్ చైర్మన్లు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, రాయల నాగేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.



**కార్యక్రమం సైడ్‌లైట్స్**

● విద్యార్థులకు అల్పాహారంతోపాటు అందించే మిల్క్ యూనిట్‌ను భట్టి విక్రమార్క ప్రారంభించారు.

● ఈ కార్యక్రమం దిగ్విజయంగా ముందుకు సాగాలని నృసింహ మహా యాగం చేయగా అందులో పాల్గొన్నారు.

● అల్పాహారం తయారు చేసే యంత్రాలను, కూరగాయ లాంజ్ శుద్ధి చేసే యంత్రాలను, ఇతర న్ని ఏర్పాట్లను పరిశీలించారు.

- విద్యార్థులతో కలిసి అల్పాహారం చేశారు. ఇడ్లి, పొంగల్, ఉప్మా, పూరీ, రాగి ఇడ్లి, ఇతర వంటకాలను రుచి చూశారు.

● విద్యార్థులకు వంటకాలను వడ్డించగా ఆయనతో మాట్లాడేందుకు, చేయి కలిపేందుకు విద్యార్థులు ఎంతో ఉత్సాహాన్ని చూపారు.

● వివిధ పాఠశాలలకు అల్పాహారాన్ని అందించే వాహనాలను జెండా ఊపి ప్రారంభించారు.

● సభ ప్రారంభంలో విద్యార్థులు రాష్ట్ర గీతాన్ని ఆలపించగా వాతావరణం ఉద్వేగంగా మారింది. చిన్నారులను అభినందించారు.

● సభలో పాల్గొన్న విద్యార్థులు మొత్తం భట్టి.. భట్టి అంటూ నినాదాలు చేయడం విశేషం.



# "నీ కోరిక తీరిందా రాహుల్?"...

- **కమిషనరేట్‌లో మనుసు కదిలించే దృశ్యం!**
- **'పోలీస్' కావాలన్న కలను నిజం చేసిన మల్కాజిగిరి సీపీ సుమతి**
- **ఒక్కరోజు పోలీస్ అధికారిగా అవకాశం**
- **దివ్యాంగుల పట్ల ప్రతి ఒక్కరూ దయ చూపాలని పిలుపు**

**మేడ్చల్/ దమ్మాయిగూడ, జూలై 27 :**

పుట్టుకతోనే అంగవైకల్యంతో బాధపడుతూ నడవలేని స్థితిలో ఉన్న దమ్మాయిగూడకు చెందిన రాహుల్ చిరకాల కోరికను మల్కాజిగిరి పోలీస్ కమిషనర్ బడుగుల సుమతి నెరవేర్చారు. సమాజంలో పోలీసులంటే ఉండే కరకుతనాన్ని కాకుండా, వారిలోని కరుణను చాటిచెప్పే అద్భుత ఘట్టానికి మల్కాజిగిరి పోలీస్ కమిషనరేట్ వేదికైంది. ఒకరోజైనా పోలీస్ అధికారిగా కుర్చీలో కూర్చోవాలని కలలు కన్న రాహుల్ ను కమిషనరేట్ ప్రధాన కార్యాలయానికి సీపీ సుమతి ఆహ్వానించి తన కుర్చీలో కూర్చోబెట్టి పోలీస్ టోపీ ధరింపజేశారు. "నీ కోరిక తీరిందా రాహుల్?" అంటూ ఆప్యాయంగా పలకరించగా, ఆనందంతో చిరునవ్వులు చిందించిన రాహుల్ తన సంతోషాన్ని వ్యక్తం చేశాడు. ప్రకాశం జిల్లా కందుకూరు నుంచి వలస వచ్చిన తిరుమలరావు-రాధమ్మ దంపతుల కుమారుడు రాహుల్ పుట్టుకతోనే అంగవైకల్యంతో బాధపడుతున్నాడు. రెండు కాళ్లు ఉన్నప్పటికీ నడవలేని పరిస్థితి, మాటలు కూడా సరిగా మాట్లాడలేని స్థితిలో ఉండటంతో కుటుంబానికి భారంగా మారాడు.ఈ విషయాన్ని తెలంగాణ వికలాంగుల హక్కుల సాధన సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మెరుగు శివకృష్ణ, ప్రతిమ ఫౌండేషన్ చైర్మన్ రష్మిత దృష్టికి తీసుకెళ్లగా, రాహుల్‌కు వీల్‌చైర్‌ను అందజేసి మానవత్వాన్ని చాటుకున్నారు. రాహుల్ కోరిక నెరవేరడంతో అతని తల్లిదండ్రులు సీపీ బాడుగుల సుమతి, ప్రతిమ ఫౌండేషన్ చైర్మన్ రష్మిత, మెరుగు శివకృష్ణలకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

**స్వచ్ఛంద సంస్థలు అంకితభావంతో పనిచేయాలి : పోలీస్ కమిషనర్ సుమతి**

స్వచ్ఛంద సంస్థలు పేద ప్రజల కోసం అంకితభావంతో పనిచేసినప్పుడే ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా ఉండిపోతారని నిస్వార్థంగా ప్రజలకు సేవలు అందించాలని బడుగుల సుమతి స్వచ్ఛంద సంస్థల నేతలతో అన్నారు స్వచ్ఛంద సంస్థలు సేవా కార్యక్రమాలను వికలాంగులను అంగవైకల్యాకులను మూగ చెవిటి వారిని ఆప్యాయంగా పలకరించి సోదర భావంతో మెదగాలని బడుగుల సుమతి కోరారు స్వచ్ఛంద సంస్థలు సొసైటీలో ఎప్పటినుండో ప్రజలకు చేరువై ఎన్నో సేవ కార్యక్రమాలను చేయడంపై అభినందించారు ఈ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్ట్ దామరపల్లి నర్సింహారెడ్డి , చింతల విజయ్ కుమార్, జినుక రఘు పాల్గొన్నారు.

# సైబర్ మోసాల బారిన ప్రజలు..

- **రూ.2.10 కోట్లకు పైగా టోకరా..!**
- **ఫారెక్స్ ట్రేడింగ్ పేరుతో రూ.33 లక్షల మోసం**
- **వాట్సాప్‌లో నకిలీ సందేశాలతో రూ.67 లక్షలు కాజేసిన కేటుగాళ్లు**

**హైదరాబాద్, జూలై 26:**

సైబర్ నేరగాళ్లు కొత్త కొత్త పద్ధతులతో ప్రజలను మోసం చేస్తూ భారీగా డబ్బులు కాజేస్తున్నారు. ఫారెక్స్ ట్రేడింగ్‌లో అధిక లాభాలు, వాట్సాప్‌లో వ్యాపార భాగస్వామి పేరుతో నకిలీ సందేశాలు, విదేశీ వ్యవసాయ భూముల్లో పెట్టుబడుల పేరుతో ముగ్గురు బాధితుల నుంచి మొత్తం రూ.2.10 కోట్లకు పైగా మోసం చేసిన ఘటనలు వెలుగులోకి వచ్చాయి. ఈ మూడు ఘటనలపై సైబర్ క్రైమ్ పోలీసులు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కొండాపూర్‌కు చెందిన ఓ ప్రైవేట్ ఉద్యోగి సోషల్ మీడియాలో కనిపించిన ఫారెక్స్ ట్రేడింగ్ ప్రకటనను నమ్మి మోసపోయాడు. వాట్సాప్ గ్రూపులో చేర్చిన నిందితులు అధిక లాభాలు వస్తాయని నమ్మబలికి దశలవారీగా మొత్తం రూ.40.30 లక్షలు పెట్టుబడి పెట్టించారు. అనంతరం కేవలం రూ.7.30 లక్షలు మాత్రమే తిరిగి చెల్లించి, మిగిలిన రూ.33 లక్షలతో పరారయ్యారు. గచ్చిబౌలిలోని ఓ ప్రైవేట్ సంస్థ అకౌంటెంట్‌ను వ్యాపార భాగస్వామి పేరుతో కొత్త నంబర్ నుంచి వాట్సాప్ సందేశాలు పంపి నమ్మించారు. జులై 16 నుంచి 22 మధ్య వివిధ బ్యాంకు ఖాతాలకు మొత్తం రూ.67 లక్షలు బదిలీ చేయించుకున్నారు. మరో రూ.25 లక్షలు పంపాలని కోరడంతో అనుమానం వచ్చిన బాధితుడు అసలు వ్యాపార భాగస్వామిని సంప్రదించగా మోసం వెలుగులోకి వచ్చింది. నల్లగండ్లకు చెందిన మరో ప్రైవేట్ ఉద్యోగిని రష్యాలో వ్యవసాయ భూముల్లో పెట్టుబడులు పెడితే మూడు నెలల్లో భారీ లాభాలు వస్తాయని ఆశ చూపి రూ.1.10 కోట్లు వసూలు చేశారు. అవసరమైతే రష్యాకు తీసుకెళ్తామని నమ్మించి డబ్బు తీసుకున్న తర్వాత మోసగాళ్లు అందుబాటులో లేకపోవడంతో బాధితుడు పోలీసులను ఆశ్రయించాడు. ఈ ఘటనల నేపథ్యంలో సోషల్ మీడియాలో కనిపించే పెట్టుబడి ప్రకటనలు, వాట్సాప్ ద్వారా వచ్చే ఆర్థిక లావాదేవీల సూచనలు, విదేశీ పెట్టుబడుల పేరుతో అధిక లాభాల హామీలను నమ్మవద్దని సైబర్ క్రైమ్ పోలీసులు హెచ్చరించారు. పెట్టుబడులు పెట్టే ముందు సంబంధిత సంస్థల విశ్వసనీయతను నిర్ధారించుకోవాలని, మోసానికి గురైతే వెంటనే సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు.

# డ్రగ్స్ మత్తులో పోలీసులపైకి కారుతో దూసుకెళ్లిన యువకుడు

- **డ్రగ్స్ దందాపై దాడి చేసిన హెచ్-న్యూ బృందంపై దాడి.. కానిస్టేబుల్‌కు తీవ్ర గాయాలు**
- **అబిడ్స్‌లో డ్రగ్స్ కొనుగోలు సమాచారంతో నిఘా పెట్టిన పోలీసులు**
- **వాహనం ఆపినట్లు నటించి కానిస్టేబుల్‌పైకి కారు దూసుకెళ్లిన నిందితుడు**
- **కానిస్టేబుల్ మహేందర్ యాదవ్‌కు కాలు విరగడంతో ఆస్పత్రికి తరలింపు**
- **ఇన్‌స్పెక్టర్ శ్రీకాంత్, కానిస్టేబుల్ వంశీధర్‌కు స్వల్ప గాయాలు**
- **హత్యాయత్నం కేసు నమోదు చేసి నిందితుడు సైఫ్‌ను అదుపులోకి తీసుకున్న పోలీసులు**


**హైదరాబాద్, జూలై 26:**

డ్రగ్స్ మత్తులో ఓ యువకుడు పోలీసులపైనే కారుతో దాడికి పాల్పడిన ఘటన హైదరాబాద్‌లో సంచలనం సృష్టించింది. డ్రగ్స్ కొనుగోలు జరుగుతోందన్న సమాచారంతో అబిడ్స్‌లో నిఘా పెట్టిన హైదరాబాద్ నార్కోటిక్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం (హెచ్‌న్యూ) పోలీసులపై నిందితుడు కారును దూసుకెళ్లడంతో కానిస్టేబుల్ మహేందర్ యాదవ్ తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటనలో మరో కానిస్టేబుల్, ఇన్‌స్పెక్టర్ కూడా గాయపడగా, నిందితుడిపై హత్యాయత్నం కేసు నమోదు చేశారు.

పోలీసుల వివరాల ప్రకారం, హెచ్‌న్యూ కానిస్టేబుల్ మహేందర్ యాదవ్‌కు అబిడ్స్ ప్రాంతంలో డ్రగ్స్ కొనుగోలు జరుగుతోందన్న సమాచారం అందింది. దీంతో ఇన్‌స్పెక్టర్ శ్రీకాంత్ ఆధ్వర్యంలోని ప్రత్యేక బృందం అక్కడ నిఘా ఏర్పాటు చేసింది. ఈ సమయంలో బ్లూ రంగు బెలెనో కారు పాయల్ ఫుట్‌వేర్ సమీపానికి చేరుకోగా, ఓ వ్యక్తి కారులో ఉన్న వ్యక్తికి అనుమానాస్పద ప్యాకెట్ అందజేశాడు. వెంటనే పోలీసులు ప్యాకెట్ అందించిన వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు.

కారులో ఉన్న హుస్సేనీ ఆలం ప్రాంతానికి చెందిన సైఫ్‌కు పోలీసులు తమ గుర్తింపు కార్డులు చూపించి వాహనం నుంచి దిగాలని సూచించారు. అయితే కారు ఆపుతున్నట్లు నటించిన సైఫ్ ఒక్కసారిగా రివర్స్‌లో వేగంగా వాహనాన్ని నడిపి పోలీసులపైకి దూసుకొచ్చాడు. అడ్డుకునేందుకు ప్రయత్నించిన కానిస్టేబుల్ మహేందర్ యాదవ్ కాలిపై నుంచి కారు వెళ్లడంతో ఆయనకు తీవ్ర గాయాలయ్యాయి. అనంతరం నిందితుడిని వెంబడించిన హెచ్‌న్యూ బృందం అఫ్జల్‌గంజ్ వద్ద కారును అడ్డుకుని సైఫ్‌ను అదుపులోకి తీసుకుంది. ఈ క్రమంలో ఇన్‌స్పెక్టర్ శ్రీకాంత్, కానిస్టేబుల్ వంశీధర్‌కు కూడా స్వల్ప గాయాలయ్యాయి. కాలు విరిగిన మహేందర్ యాదవ్‌ను వెంటనే సోమాజిగూడలోని యశోద ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. కానిస్టేబుల్ మహేందర్ యాదవ్ ఫిర్యాదు మేరకు సైఫ్‌పై అబిడ్స్, అఫ్జల్‌గంజ్ పోలీస్ స్టేషన్లలో హత్యాయత్నం సహా పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. ప్రస్తుతం నిందితుడిని హెచ్‌న్యూ పోలీసులు అదుపులోకి తీసుకుని డ్రగ్స్ వ్యవహారంతో పాటు ఈ దాడికి సంబంధించిన అన్ని కోణాల్లో దర్యాప్తు కొనసాగిస్తున్నారు.






# పారిశ్రామికాభివృద్ధి మరింత వేగవంతం కావాలి

**హైదరాబాద్, జూలై 27 :**

పారిశ్రామికాభివృద్ధి మరింత వేగం తీసుకురావాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు అధికారులను ఆదేశించారు. మహేశ్వరం ఈసిటీలోని ఎలక్ట్రానిక్ మాన్యుఫ్యాక్చరింగ్ క్లస్టర్‌ను, ప్రీమియర్ ఎనర్జీస్ ఫొటో వోల్టాయిక్ ప్రైవేట్ లిమిటెడ్, అవాంటెల్ లిమిటెడ్ పరిశ్రమ, మంఖాల్ పారిశ్రామిక పార్కును, ఎం/ఎస్ చిరిపాల్ పాలీ ఫిల్మ్స్ లిమిటెడ్ పరిశ్రమలను సంజయ్ జాజు సోమవారం సందర్శించారు. పరిశ్రమల అభివృద్ధి, పెట్టుబడులు, ఉపాధి అవకాశాల కల్పనలో ప్రభుత్వం చేపడుతున్న చర్యలను అభినందించారు. ముందుగా మెసర్స్ ప్రీమియర్ ఎనర్జిస్ ఫొటోవోల్టాయిక్ ప్రైవేట్ లిమిటెడ్‌ను సందర్శించారు. సోలార్ పీవీ మాడ్యూల్స్ తయారు చేస్తోన్న ఈ పరిశ్రమ లో ప్రస్తుతం 1,200మంది పనిచేస్తున్నారు. అనంతరం ఎం/ఎస్ అవాంటెల్ లిమిటెడ్ పరిశ్రమను సీ.ఎస్ సందర్శించారు. ఈ పరిశ్రమ హైటెక్ రక్షణ ఎలక్ట్రానిక్స్, శాటిలైట్ పేలోడ్ వ్యవస్థలు, గ్రౌండ్ స్టేషన్ మౌలిక సదుపాయాల అభివృద్ధి ప్రధానంగా చేపడుతోంది. రూ.59.22 కోట్ల పెట్టుబడి గల ఈ సంస్థలో 400మంది పనిచేస్తున్నారు. మంఖాల్ పారిశ్రామిక పార్కులో మెసర్స్ చిరిపాల్ పాలీ ఫిల్మ్స్ లిమిటెడ్ పరిశ్ర మను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సందర్శించారు. ఈ యూనిట్ వాణిజ్య ఉత్పత్తి నిర్వహిస్తూ రూ.284.02 కోట్ల పెట్టుబడితో 500మందికి ఉపాధి కల్పిస్తోంది.



అనంతరం మహేశ్వరం జనరల్ పార్కులోని మెసర్స్ విప్రో ఎంటర్‌ప్రైజెస్(ప్రై) లిమిటెడ్‌ను సందర్శించారు. ఈ యూనిట్ రూ.17,434 లక్షల పెట్టుబడితో వాణిజ్య ఉత్పత్తి నిర్వహిస్తూ 331 మందికి ఉపాధి కల్పిస్తోంది. ఎం/ఎస్ మలబార్ జెమ్స్ అండ్ జ్యువెలరీ మాన్యుఫ్యాక్చరింగ్ ప్రైవేట్ లిమిటెడ్‌ను సంజయ్ జాజు సందర్శించారు. ప్రస్తుతం ఈ యూనిట్ రూ.37,405 లక్షల పెట్టుబ డితో వాణిజ్య ఉత్పత్తి నిర్వహిస్తూ 2,782మందికి ఉపాధి కల్పిస్తోంది. ఆయన వెంట టీజీఐఐసీ వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ శశాంక, సీనియర్ ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు.

**తెలంగాణ మోడల్ స్కూల్ సందర్శన**

మండలంలోని తెలంగాణ మోడల్ స్కూల్‌ను సీఎస్ సంజయ్ సంద ర్శించి విద్యా బోధన, మౌలిక వసతులు, విద్యార్థులకు కల్పిస్తున్న సౌక ర్యాలను పరిశీలించారు. విద్యార్థులతో ఆత్మీయంగా ముచ్చటించిన ఆయన వారి విద్య, భవిష్యత్ లక్ష్యాలు, పోటీ పరీక్షలకు సన్నద్ధత, వ్యక్తిత్వ వికాసం, నాయకత్వ లక్షణాల పెంపు వంటి అంశాలపై విలువైన సూచనలు, మార్గదర్శకత్వం అందించారు. విద్యార్థులు చిన్నప్పటి నుంచే ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని వాటి సాధన కోసం క్రమశిక్షణ, పట్టుదల, నిరంతర శ్రమతో ముందుకు సాగాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు కూడా జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరుస్తున్నారని పేర్కొంటూ ప్రభుత్వం కల్పిస్తున్న విద్యావకాశాలు, సాంకేతిక వనరులు, గ్రంథాలయాలు, ప్రయోగశాలలను పూర్తిస్థాయిలో వినియోగించుకుని జీవితంలో ఉన్నత స్థానాలను అధిరోహించాలని పిలుపునిచ్చారు. అనంతరం పాఠశాలలోని తరగతి గదులు, సైన్స్ ప్రయోగశాలలు, కంప్యూటర్ ల్యాబ్, గ్రంథాలయం, వసతి గృహాలు, తాగునీటి సౌకర్యం, పారిశుధ్య నిర్వహణ, ఇతర మౌలిక వసతులను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. పాఠశాలకు అవసరమైన మౌలిక సదుపాయాలపై ఉపాధ్యాయులు, అధికారులతో సమీక్షించిన ఆయన విద్యార్థులకు నాణ్యమైన విద్యా వాతావరణం కల్పించేందుకు అవసరమైన వసతుల మంజూరుకు తన వంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. పాఠశాల సమయాల్లో విద్యార్థుల రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆర్టీసీ బస్సు సేవలను పాఠశాల వరకు పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకురావాలని, సంబంధిత అధికారులతో సమన్వయం చేసి తక్షణ చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. పాఠశాల ఆవరణలో మొక్కను నాటిన ప్రధాన కార్యదర్శి పర్యావరణ పరిరక్షణ ప్రతి పౌరుడి సామాజిక బాధ్యత అని అన్నారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించడం ద్వారా భావితరాలకు స్వచ్ఛమైన, హరిత వాతావరణాన్ని అందించాలని పిలుపునిచ్చారు. శశాంక్, కృష్ణ ఆదిత్య జిల్లా విద్యా శాఖ అధికారి, జిల్లా మైనారిటీస్ సంక్షేమ శాఖ అధికారులు, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## సంపాదకీయం



# వ్యవస్థల వైఫల్యం

## రగులుతున్న యువత ఆగ్రహం!

**జవాబుదారీతనం కరువైతే ప్రజా ఉద్యమాలు తప్పవు**

దేశంలో యువత తక్షణ స్పందన కోరుకుంటోంది. సమస్యలపై తక్షణ చర్యలను కోరుతోంది. రాజకీయ నాయకులు లేదా పాలకులు సమస్యలపై తక్షణమే స్పందించి చర్యలు తీసుకోవడంలో విఫలం అవుతు న్నారు. కావాలనే తాత్సారం చేస్తున్నారు. దీంతో ప్రజల్లో తీవ్ర నిరాశా, నిస్పృహలు ఉన్నాయి. ఏ సమయంలో చేయాల్సిన పనిని అప్పుడే చేయడం లేదు. నాన్చివేత ధోరణి కారణంగా దేశం అడుగు ముందుకు వేయడం లేదు. జిఎస్టీని తీసుకుని వచ్చి గొప్పలు చెప్పారు. ప్రజలు దీనికి బలవుతున్నా పట్టించుకోలేదు. ఇప్పుడు జిఎస్టీ శ్లాబ్‌లను తగ్గించాలని కోరుతున్నా పట్టించుకోవడం లేదు. ఆహార ధరలు పెరుగుతున్నా పట్టింపు లేదు. మందుల మాఫియాను అరికట్టడం లేదు. అవినీతి వేళ్లూనుకుని పోయింది. అయినా పట్టించుకోవడం లేదు. ఇలా ఒకటేమిటి అనేకానేక సమస్యలు ఉన్నాయి. ఇవన్నీ పట్టించుకోక పోవడం వల్లనే ..నీట్ పేపర్ లీక్ తరవాత యువత ఉద్యమించింది. ఇది మొదలూ కాదు..అంతం కూడా కాదని పాలకులు గుర్తించాలి. ఇంతటితో ఇక పీడ విరగడ అయ్యిందని పాలకుల భావిస్తే అంతకుమించి మూల్యం చెల్లించుకో తప్పదు. యువత బొద్దింకలుగా మారి దేశ రాజధాని ఢిల్లీని చుట్టుముట్టే పరిస్థితి ఎందుకొచ్చిందని ఆత్మపరిశీలన చేసుకోవాలి. పార్లమెంట్ జరుగుతోంది. అయినా సమస్యలపై చర్చించడం లేదు. ఆరోరోజు కూడా విపక్షాలు ప్రధాని మోడీ, అమిత్ షాలు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేస్తూ సభాసమయాన్ని వృధా చేస్తున్నాయి. ఇది ప్రజల సమయం, ప్రజలు ఇచ్చిన అధికారం అని గుర్తించాలి. ఇలాగే చేస్తూ పోతే..పార్లమెంటులో గబ్బిలాల్లా ఏళ్ల తరబడి పట్టుకుని వేళ్లాడుతున్న నేతలను కూడా తొలగించడానికి ఉద్యమించక తప్పదేమో. ప్రశ్నపత్రాలు లీక్ కావడం ఇదే మొదటిసారి కాదు. గతంలో అనేక సందర్భాలలో జరిగాయి. దశాబ్దాల క్రితం ఇలాంటి ఘటనలు జరిగినప్పుడు మంత్రులు రాజీనామా చేసిన ఉదంతాలు కూడా ఉన్నాయి. కానీ ఇప్పుడే ఎందుకింత ఉద్యమం జరిగిందంటే కారణం యువతలో ఉన్న ఆక్రోశమని గుర్తించాలి. నాయకుల తీరుపట్ల ప్రజల్లో, ముఖ్యంగా యువతలో నిరాశా నిస్పృహలు పెరిగిపోతున్నాయని గ్రహించాలి. ప్రజాస్వామ్యాన్ని నిలబెట్టే మూల స్తంభాలు తమ బాధ్యతల నుంచి దూరం జరగడం కూడా ప్రస్తుత దుస్థితికి కారణం.చట్టసభల్లో సమస్యలపై చర్చించి, వాటికి పరిష్కారం చూపడం లేదు. అసలు సమస్యలనే గుర్తించడం లేదు. ఇకవాటిపై చర్చల గురించి ఆలోచన తరవాత. ప్రధాన ప్రతిపక్షం సమస్యలపై చర్చ చేయకుండా సభను స్తంభింప చేయడం మాత్రమే చేస్తోంది. అధికార పక్షం ప్రజల సమస్యలకు జవాబు ఇవ్వండ లేదు. కేవలం తమ స్వప్రయోజనాల కోసం పార్లమెంటును నడపుతున్నారా అన్న భావన కులుగుతోంది. బొద్దింకలు చేపట్టిన ఆందోళన విరమణతో ప్రస్తుత సమస్య తాత్కాలికంగా సమసిపోతే పోవచ్చు. కానీ ప్రధాన వ్యవస్థలు తమ బాధ్యతను గుర్తించి మెలగని పక్షంలో మరో సమస్య వచ్చినప్పుడు ఆందోళనలు ఇంతకు మంచి ఊపందుకుంటాయి. మన దేశంలో ప్రజాస్వామ్య వ్యవస్థ బలంగా ఉన్నందువల్లే మనం స్వేచ్ఛగా జీవించగలుగుతున్నాం. దానిని బలహీనపరచడమంటే ప్రజాస్వామ్యం మనుగడే ప్రమాదంలో పడుతుంది. వ్యవస్థలకు వ్యతిరేకంగా కాకుండా వాటిల్లో జవాబుదారీ తనాన్ని తీసుకురావడానికి పోరాడవలసిన సమయం ఇప్పుడు ఆసన్నమైంది. కాక్రోచ్ జనతా పార్టీ కోరుతున్నది అదే కనుక నేతలు తమ పద్దతిని మార్చుకుంటే మంచిది. ముఖ్యంగా రాజకీయ పార్టీలు కూడా ఇప్పుడు ఆత్మపరిశీలన చేసుకోవాలి. ఒక సామాన్యుడైన అభిజీత్ దీప్కే ప్రారంభించిన కాక్రోచ్ జనతా పార్టీ వెనుక నిలబడడం ద్వారా కాంగ్రెస్ తదితర పార్టీలు ఓ రకంగా తమ ఉనికిని కోల్పోయానే చెప్పాలి. వారు చేయాల్సిన పనిని వారి పార్టీలు చేయలేకపోయాయి. ఈ దుస్థితి ఎందుకొచ్చిందో రాజకీయ పార్టీలు ప్రశ్నించుకోవాలి. సామాన్య ప్రజలు చేపట్టిన ఆందోళనకు దిగి రావాల్సిన పరిస్థితి ఎందుకొచ్చిందో పాలకులు కూడా గ్రహించాలి. ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రజలను, ప్రత్యర్థులను భయపెడుతూ ఎంతో కాలం మనుగడ సాగించలేమని పాలకులు గుర్తించాలి. ప్రజాస్వామ్యం మౌలిక సూత్రాలను ఆచరించి అమలు చేస్తామన్న నమ్మకాన్ని పాలకులు ప్రజల్లో కల్పించాలి. . పరిస్థితి చేయి దాటిపోతోందని గ్రహించిన తరవాతనే కేంద్ర ప్రభుత్వ పెద్దలు అప్పటికప్పుడు నిర్ణయాలు తీసుకున్నారు. సోషల్ మీడియా ఇంతలా విస్తరించిన ఈ కాలంలో ఏ విషయాన్ని కూడా దాచిపెట్టలేమని ప్రభుత్వాలు, ప్రధాన పార్టీలు గుర్తించాలి. ముఖ్యంగా యువతలో పేరుకుపోతున్న నిరాశా నిస్పృహలకు సమాధానం చెప్పాలి. పార్లమెంటులో ఎప్పటికప్పుడు ప్రధాన సమస్యలపై అర్థవంతమైన చర్చలు సాగాలి. సమస్యలు పరిష్కారం అయ్యేలా తక్షణ చర్యలకు పూనుకోవాలి. దాశాబ్దాలుగా సమస్యలను నానపెడుతూ మరిని కొత్త సమస్యలకు కారణం కారాదు. అలాగే పాలకలు విలాసాలు వీడాలి. ప్రజల సొమ్మకు జవాబుదారీ తనాన్ని అలవర్చుకోవాలి. జల్సాలు చేసేందుకు చేసే ప్రయత్నాలను ఇప్పటికైనా ముగించాలి. లేదంటే ఏ చిన్న సంఘటన జరిగినా ఆందోళనలు మరింత ఉదీథంగా పుట్టుకురావొచ్చు. ఇప్పుడున్న నేతలు ఎవరినీ ప్రజలు ఎవరినీ నమ్మలేని పరిస్థితి ఏర్పడుతోంది. దానిని అధిగమించకపోతే పాలకులకు ఎదురుదెబ్బలు తప్పవు..

# లోక్‌సభలో పేపర్ లీకేజీ సవరణ బిల్లు

- పార్లమెంట్‌లో కొనసాగిన ప్రతిష్ఠంభన
- మోడీ, అమిత్ షా క్షమాపణలకు విపక్షాల డిమాండ్



**న్యూఢిల్లీ, జూలై 27:** పార్లమెంట్ ఉభయసభల్లో సోమవారం కూడా ప్రతిష్ఠంభన కొనసాగింది. విద్యార్థులపై నమోదైన కేసులు ఎత్తివేయాలని, నిరసనకారులపై జరిగిన లాఠీచార్జీ ఘటనపై ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తూ విపక్ష సభ్యులు ఉభయసభల్లో ఆందోళన చేపట్టారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేయడంతో సభల్లో గందరగోళం నెలకొంది. ఈ నేపథ్యంలో లోక్‌సభ, రాజ్యసభలను పలుమార్లు వాయిదా వేశారు. గందరగోళం మధ్యే కేంద్ర ప్రభుత్వం యాంటీ పేపర్ లీక్ (సవరణ) బిల్లును లోక్‌సభలో ప్రవేశపెట్టింది. ప్రధానమంత్రి కార్యాలయ సహాయ మంత్రి జితేంద్ర సింగ్ బిల్లును సభ ముందుంచారు. బిల్లు ప్రాధాన్యాన్ని దృష్టిలో ఉంచుకుని దీనిపై చర్చకు స్పీకర్ ఓం బిర్లా అనుమతి ఇచ్చారు. అయితే విపక్ష సభ్యులు తమ నిరసన కొనసాగించడంతో చర్చ ప్రారంభం కాలేదు. అనంతరం సభను మధ్యాహ్నం 2 గంటల వరకు వాయిదా వేశారు. నీట్, యూజీసీ-నెట్ సహా పలు పోటీ పరీక్షల్లో ప్రశ్నపత్రాల లీకేజీలు వెలుగులోకి వచ్చిన నేపథ్యంలో పరీక్షల భద్రతను మరింత పటిష్ఠం చేయడమే లక్ష్యంగా కేంద్రం ఈ సవరణ బిల్లును తీసుకొచ్చింది. ప్రస్తుతం అమల్లో ఉన్న 2024 చట్టాన్ని మరింత కఠినతరం చేస్తూ నిందితులకు గరిష్ఠంగా 10 ఏళ్ల జైలు శిక్ష, రూ.10 కోట్ల వరకు జరిమానా విధించేలా ప్రతిపాదనలు చేసింది. ప్రస్తుతం ఉన్న చట్టంలో గరిష్ఠ శిక్ష ఐదేళ్లు, జరిమానా రూ.10 లక్షల వరకు మాత్రమే ఉంది. పేపర్ లీకేజీ కేసుల దర్యాప్తు కోసం ప్రతి రాష్ట్రంలో ప్రత్యేక స్పెషల్ టాస్క్ ఫోర్స్ (ఎస్‌టీఎఫ్) ఏర్పాటు చేయాలని బిల్లులో ప్రతిపాదించారు. కేసు నమోదు అయిన తర్వాత రెండు నెలల్లో దర్యాప్తు పూర్తి చేయాలని, అనంతరం ప్రత్యేక ఫాస్ట్‌ట్రాక్ కోర్టుల్లో రోజువారీ విచారణ నిర్వహించి 90 రోజుల్లో తీర్పు వెలువరించాలని నిబంధనలు రూపొందించారు. హైకోర్టులో అప్పీల్ దాఖలు చేసుకునేందుకు 30 రోజుల గడువు, అప్పీల్‌పై కూడా 90 రోజుల్లో తీర్పు ఇవ్వాలనే ప్రతిపాదనలు ఉన్నాయి. పరీక్షల నిర్వహణలో పారదర్శకత పెంచడం, ప్రశ్నపత్రాల లీకేజీలకు పూర్తిగా అడ్డుకట్ట వేయడమే ప్రభుత్వ లక్ష్యమని కేంద్రం పేర్కొంది. ఈ దిశగా సాంకేతిక సంస్కరణలు, పరీక్షల భద్రతపై సిఫార్సులు చేసేందుకు నందన్ నీలేకణి ఆధ్వర్యంలో ఉన్నతస్థాయి కమిటీని ఇప్పటికే ఏర్పాటు చేసింది. జాతీయ పరీక్షల సంస్థ (ఎన్‌టీఏ)లో పలు పరిపాలనా మార్పులు కూడా చేపట్టినట్లు ప్రభుత్వం తెలిపింది. అయితే ఈ బిల్లును విపక్షాలు తీవ్రంగా విమర్శించాయి. సమస్య మూలాలను పరిష్కరించకుండా పైపై చర్యలకే ప్రభుత్వం పరిమితమైందని ఆరోపించాయి. విద్యార్థులపై లాఠీచార్జీ ఘటనకు బాధ్యత వహిస్తూ ప్రభుత్వం సమాధానం చెప్పాలని, సంబంధిత ఘటనపై ప్రధాని మోదీ, అమిత్ షా క్షమాపణ చెప్పాలని విపక్షాలు మరోసారి డిమాండ్ చేశాయి. దీంతో పార్లమెంట్‌లో ప్రతిష్ఠంభన కొనసాగింది.

# విద్యార్థులకు క్షమాపణలు చెప్పాల్సిందే

- ఎక్స్ వేదికగా రాహుల్ గాంధీ డిమాండ్

**న్యూఢిల్లీ, జూలై 27 :** దేశవ్యాప్తంగా నిరసనలు చేపడుతున్న విద్యార్థులపై కేంద్ర ప్రభుత్వం, బీజేపీ పాలిత రాష్ట్ర ప్రభుత్వాలు అణచివేత ధోరణిని అవలంబిస్తున్నాయని కాంగ్రెస్ అగ్రనేత, ఎంపీ రాహుల్ గాంధీ మండిపడ్డారు. విద్యార్థులపై కాల్పులు, లాఠీఛార్జీలు, కేసులు నమోదు చేయడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని ఆయన ఆగ్రహించారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా పోస్టు పెడుతూ కేంద్ర ప్రభుత్వం, ప్రధాని నరేంద్ర మోదీపై రాహుల్ గాంధీ తీవ్ర విమర్శలు గుప్పించారు. ఇందుకు క్షమాపణలు చెప్పాల్సిందేనని డిమాండ్ చేశారు. బిహార్‌లో నిరసన తెలుపుతున్న విద్యార్థులపై ఏకే-47తో కాల్పులు జరిపారని, వందలాది మంది విద్యార్థులను అరెస్టు చేసి వారిపై ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశారనే వార్తలు వస్తున్నాయని రాహుల్ గాంధీ అన్నారు. విద్యార్థులపై ఎలాంటి ఎఫ్ఐఆర్‌లు నమోదు చేయబోమని, వారిని విడుదల చేస్తామని ప్రధాని నరేంద్ర మోదీ ఇచ్చిన హామీ ఏమైందని ఆయన ప్రశ్నించారు. హామీకి విరుద్ధంగా వారిపై క్రూరమైన దాడులు జరుగుతున్నాయని మండిపడ్డారు. ఢిల్లీలో విద్యార్థులపై పెల్లెట్ గన్‌లు ప్రయోగించారని, బిహార్‌లో ఏకే-47తో కాల్పులు జరిగాయని రాహుల్ ఆరోపించారు. ఉత్తరప్రదేశ్, పశ్చిమ బెంగాల్, బిహార్, ఢిల్లీ.. రాష్ట్రం ఏదైనా విద్యార్థుల గొంతు నొక్కివేయాలనే ధోరణెళి కనిపిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు.కేంద్ర ప్రభుత్వం నిజాయతీ లేనిదని తాను గతంలోనే చెప్పానని, నిజమైన సంస్కరణలు తీసుకురావడం ఈ ప్రభుత్వానికి సాధ్యం కాదని రాహుల్ విమర్శించారు. ఇచ్చిన హామీల నుంచి వెనక్కి తగ్గడంతో పాటు, విద్యార్థుల గొంతు అణచివేసేందుకు అన్ని మార్గాలను ఉపయోగిస్తోందని చెప్పుకొచ్చారు. దేశంలోని విద్యార్థులందరికీ ప్రధాని మోదీ బహిరంగంగా క్షమాపణ చెప్పాలన్నారు. విద్యార్థులపై కేసులు పెట్టడం కాకుండా, వారిపై దాడులకు పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని ఈ సందర్భంగా రాహుల్ గాంధీ డిమాండ్ చేశారు. కాగా, జులై 25న బిహార్ బంద్ సందర్భంగా సివాన్ జిల్లాలో పోలీసులు ఏకే-47తో కాల్పులు జరిపినట్లు ఆరోపణలున్నాయి. ఈ నేపథ్యంలో ఓ పోలీసు అధికారిని ఉన్నతాధికారులు సస్పెండ్ చేశారు.



## శాంతియుత నిరసనలు తెలిపే

# హక్కు ఉంది

**ఇది ప్రజాస్వామ్యంలో రాజ్యాంగం ఇచ్చిన భరోసా**

**చీఫ్ జస్టిస్ జస్టిస్ సూర్యకాంత అభిప్రాయం**



**న్యూఢిల్లీ, జూలై 27:** నీట్ పేపర్ లీక్ కేసుకు సంబంధించి విద్యార్థులపై జరిగిన లాఠీచార్జ్ వ్యవహారంపై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. భారత రాజ్యాంగం ప్రతి పౌరుడికి శాంతియుతంగా నిరసన తెలిపే హక్కును కల్పిస్తుందని, కేవలం నిరసన వ్యక్తం చేస్తున్నారనే కారణంతో పోలీసు బలప్రయోగానికి పాల్పడకూ డదని అత్యున్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. జూలై 20న 'సంసద్ చలో' కార్యక్రమంలో భాగంగా నీట్ పేపర్ లీక్ కేసుపై న్యాయం కోరుతూ విద్యార్థులు నిర్వహించిన నిరసన సందర్భంగా పోలీసులు లాఠీచార్జ్ చేయడంతో పాటు టియర్ గ్యాస్ ప్రయోగించారు. ఈ ఘటనపై స్వతంత్ర విచారణ జరపాలని కోరుతూ పలువురు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్లపై విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు రాజ్యాంగబద్ధ హక్కులపై కీలక వ్యాఖ్యలు చేసింది. విచారణ సందర్భంగా చీఫ్ జస్టిస్ మాట్లాడుతూ, భారత రాజ్యాంగం శాంతియుతంగా నిరసన తెలిపే హక్కును పౌరులకు కల్పించిందని పేర్కొంది. ప్రజాస్వామ్య వ్యవస్థలో తమ అభిప్రాయాలను శాంతియుతంగా వ్యక్తం చేసే స్వేచ్ఛ ప్రతి పౌరుడికి ఉందని స్పష్టం చేసింది. అలాగే, కేవలం నిరసన జరుగుతోందనే కారణంతోనే లాఠీచార్జ్ లేదా బలప్రయోగాన్ని సమర్థించలేమని కోర్టు వ్యాఖ్యానించింది. విద్యార్థులపై జరిగిన లాఠీచార్జ్, టియర్ గ్యాస్ ప్రయోగంపై స్వతంత్ర విచారణ జరపాలని పిటిషనర్లు కోరారు. ఈ ఘటనలో పోలీసులు అనుసరించిన విధానంపై ప్రశ్నలు లేవనెత్తుతూ బాధ్యులపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ప్రజాస్వామ్య దేశంలో శాంతియుత నిరసనలు ప్రజల ప్రాథమిక హక్కుల్లో భాగమని న్యాయ నిపుణులు పేర్కొంటున్నారు. ప్రజలు తమ సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లేందుకు నిరసనలు ఒక ప్రజాస్వామ్య మార్గమని, అలాంటి సందర్భాల్లో చట్టాన్ని అమలు చేసే సంస్థలు కూడా రాజ్యాంగబద్ధ హక్కులను గౌరవిస్తూ వ్యవహరించాలని అభిప్రాయపడుతున్నారు. సుప్రీంకోర్టు తాజా వ్యాఖ్యలు నిరసన హక్కు, పోలీసుల చర్యల పరిమితులపై మరోసారి దేశవ్యాప్తంగా చర్చకు దారితీశాయి.

## కేంద్రం హామీలు

# బుట్టదాఖిలు

**కేసుల ఉపసంహరణపై కదలిక లేదు ■ మళ్లీ దేశవ్యాప్త ఆందోళనలకు సీజేపీ హెచ్చరిక**

**విద్యార్థులకు న్యాయసాయం కోసం 'సాక్షి' ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్ ప్రారంభం**

**న్యూఢిల్లీ, జూలై 27:** నిరసనకారులపై నమోదైన కేసులను ఉపసంహరించుకుంటామని కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ ఇప్పటికీ అమలు కాలేదని 'కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ)' ఆరోపించింది. హామీలను అమలు చేయకపోతే దేశవ్యాప్తంగా మరోసారి ఆందోళనలు ప్రారంభిస్తామని హెచ్చరించింది. పేపర్ లీక్ ఘటనపై జరిగిన నిరసనల అనంతరం కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేసిన తర్వాత సీజేపీ తమ ఆందోళనను విరమించింది. కేంద్రంతో జరిగిన చర్చల్లో విద్యార్థులపై నమోదైన కేసులను ఎత్తివేస్తామని హామీ ఇచ్చారని పార్టీ ప్రతినిధులు తెలిపారు. అయితే ఇప్పటి వరకు ఆ దిశగా ఎలాంటి చర్యలు కనిపించడం లేదని విమర్శించారు. సీజేపీ ప్రతినిధి అశుతోష్ రాంకా ఎక్స్ వేదికగా స్పందిస్తూ, ప్రభుత్వం ఇచ్చిన మాటను నిలబెట్టుకోవడం లేదని ఆరోపించారు. బీహార్, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల్లో వందలాది మంది విద్యార్థులను అరెస్టు చేస్తున్నారని, ఢిల్లీతో పాటు ఇతర రాష్ట్రాల్లో నిరసనకారులపై నిఘా పెట్టి వేధింపులకు పాల్పడుతున్నారని పేర్కొన్నారు. ఉద్యమానికి లాజిస్టిక్ సహాయం చేసిన వాలంటీర్లను కూడా లక్ష్యంగా చేసుకుంటున్నారని ఆరోపించారు. ఈ సందర్భంగా పార్టీ అధికార ప్రతినిధి సౌరవ్ దాస్ మాట్లాడుతూ, కేసుల్లో చిక్కుకున్న విద్యార్థులకు న్యాయ సహాయం అందించేందుకు 'సాక్షి' పేరుతో ప్రత్యేక ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్‌ను ప్రారంభించినట్లు వెల్లడించారు. దేశవ్యాప్తంగా నిరసనకారులపై నమోదైన ఎఫ్ఐఆర్‌లను వెంటనే ఉపసంహరించుకోవాలని, అదుపులో ఉన్న విద్యార్థులను విడుదల చేయాలని, వాలంటీర్లపై నిఘా, వేధింపులు నిలిపివేయాలని కేంద్రాన్ని డిమాండ్ చేశారు. అస్సాం, బీహార్, పశ్చిమ బెంగాల్ తదితర రాష్ట్రాల్లో పలువురు ఆందోళనకారులను అరెస్టు చేసినట్లు తమ దృష్టికి వచ్చిందని, ఈ కేసులపై న్యాయవాదులతో సంప్రదింపులు జరుపుతున్నామని సౌరవ్ దాస్ తెలిపారు. కేంద్ర మంత్రులు జేపీ నడ్డా, జితేంద్ర సింగ్ ఈ అంశంలో తక్షణం జోక్యం చేసుకోవాలని కోరారు. రేపటిలోగా దేశవ్యాప్తంగా నిరసనకారులపై నమోదైన అన్ని కేసులను ఉపసంహరించుకోవడంతో పాటు, నిర్బంధంలో ఉన్న వారిని విడుదల చేయాలని సీజేపీ డిమాండ్ చేసింది. బీజేపీ పాలిత రాష్ట్రాలు, ఢిల్లీ పోలీసులు లేదా కేంద్ర దర్యాప్తు సంస్థలు కొత్త కేసులు నమోదు చేయకుండా చర్యలు తీసుకోవాలని కోరింది. లేదంటే తదుపరి కార్యాచరణ ప్రకటించి మళ్లీ దేశవ్యాప్త ఆందోళనలకు దిగుతామని అల్టిమేటం జారీ చేసింది. సోమవారం సీనియర్ సుప్రీంకోర్టు న్యాయవాది, సమాజ్‌వాదీ పార్టీ రాజ్యసభ సభ్యుడు కపిల్ సిబల్‌తో కలిసి నిర్వహించిన సంయుక్త విలేకరుల సమావేశంలో సౌరవ్ దాస్ మాట్లాడుతూ, ప్రభుత్వం తమ డిమాండ్లను అంగీకరించడంతో జూలై 25న ఆందోళనను విరమించుకున్నామని, అయితే ఆందోళన తగ్గిన తర్వాత విద్యార్థులను ఒక్కొక్కరిగా లక్ష్యంగా చేసుకుంటారనే అనుమానం తమకు ముందే ఉందని వ్యాఖ్యానించారు.



ప్రజా శంఖారావం
PRAJA SHANKARAVAM
మంగళవారం
జూలై 28, 2026
epaper.prajashankaravam.com
www.prajashankaravam.com

# ఆగస్టు 15లోపు జలసిరి పనులు పూర్తి చేయాలి

- ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు ప్రణాళికాబద్ధంగా చర్యలు
- 28న మండల స్థాయి, 29-30 తేదీల్లో గ్రామసభలు
- నిజామాబాద్ అదనపు కలెక్టర్ వీ భుజంగరావు



**నిజామాబాద్ జిల్లా ప్రతినిధి, జూలై 27 (ప్రజాశంఖారావం):**

ఎల్‌నినో ప్రభావంతో ఏర్పడే వర్షాభావ పరిస్థితులను అధిగమించేందుకు గ్రామీణ ప్రాంతాల్లో జలసిరి కార్యక్రమాలను విస్తృతంగా చేపట్టి, ఆగస్టు 15లోపు అన్ని పనులు పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ వి. భుజంగరావు అధికారులను ఆదేశించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని ప్రధాన సమావేశ మందిరంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమం అనంతరం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 28న అన్ని మండలాల్లో మండల స్థాయి సమావేశాలు, 29, 30 తేదీల్లో గ్రామ పంచాయతీ స్థాయిలో గ్రామసభలు నిర్వహించాలని మండల ప్రత్యేక అధికారులకు సూచించారు. ఈ సమావేశాల ద్వారా ఎల్‌నినో ప్రభావం, జల సంరక్షణ అవసరం, తీసుకోవాల్సిన చర్యలపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని అన్నారు. వీబీజీ–రామ్‌జీ పథకం కింద ఇంకుడు గుంతలు, ఊటకుంటలు, పంటకుంటలు, బోరు బావుల రీఛార్జ్ నిర్మాణాలను పెద్ద ఎత్తున చేపట్టి వర్షపు నీటిని ఒడిసిపట్టాలని సూచించారు. ఈ పనుల ద్వారా జాబ్‌కార్డులు కలిగిన కూలీలకు అధిక ఉపాధి కల్పించాలని, ప్రతి గ్రామంలో రోజుకు సగటున 60 మందికి పని దొరికేలా ప్రణాళిక రూపొందించాలని తెలిపారు. ప్రతి ఇంటికి ఒక ఇంకుడు గుంత ఉండేలా చర్యలు తీసుకోవాలని, భూగర్భ జలాల పెంపునకు జలసిరి కార్యక్రమాలకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని పేర్కొన్నారు. గ్రామీణ నీటి సరఫరా, పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ శాఖ అధికారులు, ఎంపీడీఓలు, ఎంపీఓలు, ఏపీఓలు, ఏఈఓలు, వీఓలు, స్వయం సహాయక సంఘాల ప్రతినిధులు సమన్వయంతో పనిచేసి నిర్ణీత గడువులో పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. అదేవిధంగా గ్రామాల్లో నిర్మిస్తున్న వీఓ భవనాల పనులను కూడా నవంబర్ 15లోపు పూర్తిచేయాలని సూచించారు. సమావేశంలో ట్రైనీ కలెక్టర్ సురేష్, డీఆర్ఓ గీత, నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్‌కుమార్, జెడ్పీ సీఈఓ సాయాగౌడ్, డీఆర్డీఓ సాయన్నతో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# జర్నలిస్టుల హక్కుల కోసం పార్లమెంట్ వద్ద టీడబ్ల్యూజేఎఫ్ గళం

- జంతర్‌మంతర్‌లో 'ఛలో పార్లమెంట్' ధర్నా.. కేంద్రానికి వినతిపత్రాల సమర్పణ




**నిజామాబాద్ జిల్లా ప్రతినిధి, జూలై 27 (ప్రజాశంఖారావం):**

దేశవ్యాప్తంగా జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) ఆధ్వర్యంలో ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద సోమవారం భారీ ధర్నా నిర్వహించారు. రాష్ట్ర కమిటీ ఇచ్చిన 'ఛలో పార్లమెంట్' పిలుపు మేరకు తెలంగాణలోని వివిధ జిల్లాల నుంచి తరలివచ్చిన పాత్రికేయులు ఉద్యమంలో పాల్గొని జర్నలిస్టుల హక్కుల కోసం గళమెత్తారు. ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య అధ్యక్షతన జరిగిన ధర్నాను ఇండియన్ ఫెడరేషన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ నాయకులు, ఢిల్లీ యూనియన్ ఆఫ్ జర్నలిస్ట్స్ అధ్యక్షుడు మారూఫ్ రజా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దేశవ్యాప్తంగా జర్నలిస్టుల సంక్షేమం, భద్రత, హక్కుల పరిరక్షణకు సంబంధించిన సమస్యలను కేంద్ర ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. జర్నలిస్టుల హక్కుల కోసం తెలంగాణ జర్నలిస్టులు పార్లమెంట్ సమీపంలో ఆందోళన చేపట్టడం అభినందనీయమని పేర్కొన్నారు. ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య మాట్లాడుతూ, జర్నలిస్టుల సమస్యలు పరిష్కారమయ్యే వరకు తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. దేశంలోని ప్రతి పాత్రికేయుడి హక్కుల పరిరక్షణ కోసం తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ నిరంతరం పోరాటం చేస్తుందని తెలిపారు. ఈ సందర్భంగా జర్నలిస్టులకు రైల్వే రాయితీ పాస్‌ల పునరుద్ధరణ, పదవీ విరమణ చేసిన జర్నలిస్టులకు జాతీయ పెన్షన్ పథకం అమలు, జర్నలిస్టుల రక్షణ చట్టం తీసుకురావడం, నేషనల్ మీడియా కమిషన్ ఏర్పాటు, జర్నలిస్టుల ఇళ్ల స్థలాలకు సంబంధించిన సుప్రీంకోర్టు తీర్పుపై పునఃసమీక్ష చేపట్టడం తదితర డిమాండ్లతో కూడిన వినతిపత్రాలను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్‌లకు సమర్పించారు. ధర్నా కార్యక్రమంలో ఢిల్లీ యూనియన్ ఆఫ్ జర్నలిస్ట్స్ ఉపాధ్యక్షుడు లియాఖత్, సభ్యురాలు మాన్విక మిశ్రా, ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తన్నీరు శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు బండి విజయ్‌కుమార్, రాష్ట్ర నాయకులు కుంచం శ్రీనివాస్, కుడుతాడి బాపురావు, కె. రమాదేవి, జగదీశ్వర్, పద్మనాభరావుతో పాటు వివిధ జిల్లాల అధ్యక్షులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

# ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారంలో జాప్యం వద్దు


**నిర్మల్, జూలై 27 (ప్రజాశంఖారావం):**



ప్రజావాణికి వచ్చే దరఖాస్తుల పరిష్కారంలో ఎలాంటి జాప్యం లేకుండా సత్వర చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ ప్రజల నుంచి వచ్చిన వినతిపత్రాలను స్వయంగా స్వీకరించి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతి దరఖాస్తును సంబంధిత శాఖ అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి తక్షణమే స్పందించాలని సూచించారు. మండలాల వారీగా పెండింగ్‌లో ఉన్న ప్రజావాణి దరఖాస్తులను ప్రాధాన్యంగా తీసుకుని సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజల సమస్యల పరిష్కారంలో అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రజావాణి కార్యక్రమంలో విద్య, వైద్యం, ఇందిరమ్మ ఇళ్లు, పింఛన్లు, భూ సమస్యలకు సంబంధించిన వినతిపత్రాలను ప్రజలు కలెక్టర్‌కు సమర్పించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు బి. వెంకటేశ్వర్లు, కిషోర్‌కుమార్, డీఆర్ఓ రాథోడ్ రమేష్‌తో పాటు వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలి

**నిజామాబాద్ జిల్లా ప్రతినిధి, జూలై 27 (ప్రజాశంఖారావం):**



నిజామాబాద్ నగరంలోని రహదారులు, వంతెనల అభివృద్ధి పనులకు అవసరమైన నిధులు మంజూరు చేయాలని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డిని కోరారు. సోమవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో మంత్రిని కలిసి పలు అభివృద్ధి పనులకు సంబంధించిన ప్రతిపాదనలను ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నగరంలోని దేవీ రోడ్డు, రైల్వే స్టేషన్ ప్రాంతం, నాందేవాడ రైల్వే ఓవర్‌బ్రిడ్జి (ఆర్‌వోబీ) పొడిగింపు, అదనపు పనులకు నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు. నగరంలో రైల్వే లైన్ దాటేందుకు ప్రస్తుతం విజయ థియేటర్, నాందేవాడ వంతెన వద్ద మాత్రమే రెండు మార్గాలు ఉన్నాయని, పెరుగుతున్న రాకపోకల దృష్ట్యా సోనీ ఫంక్షన్ హాల్ సమీపంలోని ఎల్లమ్మగుట్ట వద్ద కొత్త రైల్వే అండర్‌పాస్ (రన్‌వే) నిర్మాణం అత్యవసరమని పేర్కొన్నారు. ఇందుకు సుమారు రూ.170 కోట్ల నిధులు మంజూరు చేయాలని కోరినట్లు తెలిపారు. అదేవిధంగా నిజామాబాద్ రేడియో స్టేషన్ నుంచి ముదక్‌పల్లి పాత జీపీ కార్యాలయం వరకు రూ.30 కోట్లతో ఆర్అండ్‌బీ రహదారి అభివృద్ధికి ప్రతిపాదనలు సమర్పించినట్లు చెప్పారు. వర్ని జంక్షన్ నుంచి నిజామాబాద్, డిచ్‌పల్లి, ఇందల్వాయి, భీమ్‌గల్ మీదుగా కమ్మర్‌పల్లి వరకు 107 కిలోమీటర్ల పొడవుతో కొత్త జాతీయ రహదారి నిర్మాణానికి సంబంధించిన ప్రతిపాదనను కూడా మంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ తెలిపారు.

# శిక్షణను సద్వినియోగం చేసుకుని లక్ష్యాన్ని సాధించాలి



**నిజామాబాద్ జిల్లా ప్రతినిధి, జూలై 27 (ప్రజాశంఖారావం):**

ఎస్సీ స్టడీ సర్కిల్ ద్వారా అందిస్తున్న శిక్షణ, అధ్యయన వనరులను సద్వినియోగం చేసుకుని పోటీ పరీక్షల్లో విజయాలు సాధించాలని ట్రైనీ అసిస్టెంట్ ఆడిట్ ఆఫీసర్ (ఏఏఓ) ఎం. ఆనంద్‌కుమార్ అభ్యర్థులకు సూచించారు. నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని ఎస్సీ స్టడీ సర్కిల్‌లో సోమవారం డైరెక్టర్ డా. దేవిదాస్ సక్పాల్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో శిక్షణ పొందుతున్న అభ్యర్థులకు పోటీ పరీక్షల్లో విజయానికి అవసరమైన మెలకువలను వివరించారు. ఈ సందర్భంగా ఆనంద్‌కుమార్ మాట్లాడుతూ.. సివిల్ సర్వీసులు, ఇతర పోటీ పరీక్షల్లో విజయాన్ని సాధించాలంటే స్పష్టమైన లక్ష్యం, క్రమశిక్షణ, సమయపాలన, నిరంతర సాధన అత్యంత కీలకమని అన్నారు. ఆత్మవిశ్వాసం, పట్టుదలతో కృషి చేస్తే లక్ష్యాన్ని తప్పకుండా చేరుకోవచ్చని అభ్యర్థులకు సూచించారు. అభ్యర్థులు అడిగిన సందేహాలకు ఆయన సమాధానాలు ఇస్తూ పలు సూచనలు చేశారు. ఆయన అందించిన మార్గదర్శకత్వం తమకు ఎంతో ఉపయోగపడిందని శిక్షణార్థులు పేర్కొన్నారు. అనంతరం ట్రైనీ అసిస్టెంట్ ఆడిట్ ఆఫీసర్ ఎం. ఆనంద్‌కుమార్‌ను ఎస్సీ స్టడీ సర్కిల్ సిబ్బంది ఘనంగా సన్మానించారు.

## ఆపద మిత్ర వాలంటీర్లకు 29న కిట్లు పంపిణీ

**నిజామాబాద్ జిల్లా ప్రతినిధి, జూలై 27 (ప్రజాశంఖారావం):**

అనుకోని రీతిలో సంభవించే ప్రకృతి విపత్తుల సమయాలలో ప్రజలకు సహాయపడేందుకు వీలుగా కలెక్టర్ ఆదేశాల మేరకు ఆపద మిత్ర వాలంటీర్లకు 14 వస్తువులతో కూడిన కిట్లను పంపిణీ చేయడం జరుగుతుందని డీ.ఆర్.డీ.ఓ, ఆపద మిత్ర నోడల్ అధికారి సాయన్న తెలిపారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో ఈ నెల 29వ తేదీన ఉదయం 10.00 గంటలకు కిట్ల పంపిణీ కార్యక్రమం ఉంటుందని అన్నారు. నిజామాబాద్ జిల్లాలోని 300 మంది ఆపద మిత్ర వాలంటీర్లకు ఈ కిట్లు అందజేస్తామని, వాలంటీర్లు తమ గుర్తింపు కార్డులతో హాజరై కిట్లు పొందాలని నోడల్ అధికారి సాయన్న సూచించారు.

## బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం



**భీంగల్, జూలై 27 (ప్రజాశంఖారావం):**

భీంగల్ మున్సిపాలిటీలో ఔట్‌సోర్సింగ్ విధానంలో ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తున్న కోట నర్సయ్య అనారోగ్యంతో మృతిచెందడంతో మున్సిపల్ యూనియన్ నాయకులు ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. మృతుడి చిత్రపటానికి నివాళులర్పించి సంతాపం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా అంత్యక్రియల ఖర్చుల నిమిత్తం భీంగల్ మున్సిపల్ యూనియన్ తరఫున రూ.5,000 ఆర్థిక సహాయాన్ని మృతుడి కుటుంబ సభ్యులకు అందజేశారు. మున్సిపల్ యూనియన్ అధ్యక్షుడు సున్నపు ఓంకార్ మాట్లాడుతూ కోట నర్సయ్య మృతి పట్ల తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుడి కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని, కుటుంబ సభ్యుల్లో ఒకరికి ఉద్యోగ అవకాశం కల్పించాలని కోరారు. యూనియన్ తరఫున ఆ కుటుంబానికి ఎల్లప్పుడూ అండగా ఉంటామని హామీ ఇచ్చారు.

## నకిలీ విలేకరులపై చర్యలు తీసుకోవాలి



**రాయికల్, జూలై 27 (ప్రజాశంఖారావం):**

రాయికల్ మండలంలో విలేకరులమని చెప్పుకుంటూ ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్న నకిలీ పాత్రికేయులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ రాయికల్ ప్రెస్‌క్లబ్ (జేఏసీ) ఆధ్వర్యంలో స్థానిక ఏఎస్ఐకి సోమవారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు చింతకుంట సాయికుమార్, ప్రధాన కార్యదర్శి సింగిడి శంకరయ్య, కోశాధికారి కడకుంట్ల జగదీశ్వర్ మాట్లాడుతూ.. ఇటీవల కొందరు వ్యక్తులు ఏ జర్నలిస్టు యూనియన్‌లోనూ, ప్రెస్‌క్లబ్‌లోనూ సభ్యత్వం లేకుండానే తమ వాహనాలకు 'ప్రెస్' స్టిక్కర్లు అతికించుకుని విలేఖరులమని చెప్పుకుంటూ చలామణి అవుతున్నారని ఆరోపించారు. ప్రజలను తప్పుదోవ పట్టించడంతో పాటు పలు గ్రామాల్లో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతూ, వాహనాలను నిలిపివేసి బెదిరింపులకు దిగుతున్నారని పేర్కొన్నారు. అలాగే సివిల్ వివాదాల్లో జోక్యం చేసుకోవడం, అధికారులను బెదిరించడం, అక్రమ వసూళ్లకు పాల్పడడం వంటి చర్యలతో నిజాయితీగా విధులు నిర్వహిస్తున్న పాత్రికేయుల ప్రతిష్ఠను దెబ్బతీస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇతర ప్రాంతాల నుంచి వచ్చి ఇదే తరహాలో నకిలీ విలేఖరులుగా వ్యవహరిస్తున్న వారిని గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరారు. కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టులు నాగమల్ల శ్రీకర్, ఎండీ ముజఫర్, మాజీ అధ్యక్షుడు వాసరి రవి, గౌరవ అధ్యక్షుడు సయ్యద్ రసూల్, ఉపాధ్యక్షులు సింగని శ్యాంసుందర్, యాచమనేని కిరణ్‌రావు, వాసం లింబాద్రి, గంగాధర సురేష్, ఇమ్మడి విజయ్‌కుమార్, ఎద్దండి జితేందర్, అనుపురం లింబాద్రి గౌడ్, గన్నవరం గంగాధర్, కోమటిరెడ్డి కిష్టారెడ్డి, చెలిమెల మల్లేశం, కొండ కళ్యాణ్‌కుమార్, ఇర్ఫాన్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణికి 166 ఫిర్యాదులు



**నిజామాబాద్ జిల్లా ప్రతినిధి, జూలై 27 (ప్రజాశంఖారావం):**

ప్రజావాణి కార్యక్రమానికి వచ్చే ఫిర్యాదులను అత్యంత ప్రాధాన్యంతో స్వీకరించి, వాటిని పెండింగ్‌లో ఉంచకుండా సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ వి. భుజంగరావు అధికారులను ఆదేశించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 166 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలను అదనపు కలెక్టర్ వి. భుజంగరావుతో పాటు ట్రైనీ కలెక్టర్ సురేష్, డీఆర్ఓ గీత, నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్‌కుమార్, జెడ్పీ సీఈఓ సాయాగౌడ్, డీఆర్డీఓ సాయన్నలకు వివరించి వినతిపత్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, అందిన ప్రతి అర్జీపై సంబంధిత శాఖల అధికారులు వెంటనే పరిశీలన జరిపి, జాప్యం లేకుండా పరిష్కార చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని అధికారులకు ఆదేశించారు. ప్రజావాణి కార్యక్రమంలో వివిధ శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

## పోతరాజులను గ్రూప్-1లో చేర్చాలి

**నిజామాబాద్ జిల్లా ప్రతినిధి, జూలై 27 (ప్రజాశంఖారావం):**

జిల్లాలోని పోతరాజు, ద్యావతి, ఆసది, కొలుపుల కుల వృత్తిదారులను 'పంబాల'గా గుర్తించి గ్రూప్–1 కుల ధ్రువీకరణ పత్రాలు జారీ చేయాలని కోరుతూ సంఘ నాయకులు సోమవారం జిల్లా అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా పోతరాజు, ద్యావతి, పంబాల, ఆసది, కొలుపుల సంఘం జిల్లా అధ్యక్షుడు ఊమ్మెడ నారాయణ మాట్లాడుతూ.. కరీంనగర్, జగిత్యాల తదితర జిల్లాల్లో గెజిట్ నిబంధనల ప్రకారం పోతరాజు కుల వృత్తిదారులకు తహసీల్దార్లు 'పంబాల' పేరుతో కుల ధ్రువీకరణ పత్రాలు జారీ చేస్తున్నారని తెలిపారు. నిజామాబాద్‌కు వచ్చిన జస్టిస్ షమీమ్ అక్తర్ నేతృత్వంలోని ఏకసభ్య ఎస్సీ వర్గీకరణ కమిషన్‌ను కలిసి ఉపకులాల పేర్లను జాబితాలో నమోదు చేయాలని కోరగా, దీనిపై రివ్యూ నివేదిక ఇస్తామని తెలిపారని అన్నారు. జిల్లా కలెక్టర్ ఆర్డీవోలు, తహసీల్దార్లకు తగిన ఆదేశాలు జారీ చేస్తే 'పంబాల' పేరుతో కుల ధ్రువీకరణ పత్రాలు జారీ చేయడం సాధ్యమవుతుందని పేర్కొన్నారు. గ్రామదేవతలను పూజించే పోతరాజు, ద్యావతి, ఆసది, కొలుపుల వర్గాలను 'పంబాల'గా గుర్తించి కుల ధ్రువీకరణ పత్రాలు జారీ చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. వినతిపత్రం సమర్పించిన వారిలో సంఘం ప్రధాన కార్యదర్శి పురుషోత్తం, నాయకులు బక్కూరి గంగాధర్, మురళి, అనంత్‌కుమార్, సదాశివ్, కోటేశ్వర్, అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

## వినాయక ఆలయ పునర్నిర్మాణానికి రూ.50 వేల విరాళం



భీమ్‌గల్, జూలై 27 (ప్రజాశంఖారావం):

భీమ్‌గల్ పట్టణంలో స్వయంభువుగా వెలసిన శ్రీ వినాయక ఆలయం శిథిలావస్థకు చేరుకోవడంతో చేపట్టిన పునర్నిర్మాణ పనులకు మున్నూరు కాపు ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూ.50 వేల ఆర్థిక సహాయం అందజేశారు. రజక సంఘం ఆధ్వర్యంలో ఆలయ పునర్నిర్మాణ కార్యక్రమం కొనసాగుతుండగా, వివిధ వర్గాల ప్రజలు, దాతలు తమ వంతు సహకారాన్ని అందిస్తున్నారు. ఈ క్రమంలో మున్నూరు కాపు ఫౌండేషన్ ప్రతినిధులు రూ.50 వేల విరాళం చెక్కును రజక సంఘం సభ్యులకు అందజేసి, ఆలయ పునర్నిర్మాణం విజయవంతంగా పూర్తికావాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ సభ్యులు మాట్లాడుతూ, ఆధ్యాత్మిక, సామాజిక సేవా కార్యక్రమాలకు తమ సంస్థ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని తెలిపారు. భవిష్యత్తులోనూ ప్రజలకు ఉపయోగపడే సేవా కార్యక్రమాల్లో భాగస్వామ్యం అవుతామని పేర్కొన్నారు. రజక సంఘం నాయకులు మున్నూరు కాపు ఫౌండేషన్‌కు కృతజ్ఞతలు తెలియజేస్తూ, సమాజంలోని దాతలు, భక్తులు కూడా ఆలయ పునర్నిర్మాణానికి ఉదారంగా సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ నీలం రవి, బోదిరే నర్సయ్య, తేజ, చరణ్, అరవింద్, నవీన్, ప్రదీప్, సతీష్, విశాల్‌తో పాటు రజక సంఘం సభ్యులు పాల్గొన్నారు.

## సత్యశోధక్ పాఠశాలలో వనమహోత్సవం



నిజామాబాద్ రూరల్ సిరికొండ, జూలై 27 (ప్రజాశంఖారావం):

మానవ జీవనానికి మొక్కలే ఆధారమని, పచ్చదనమే భవిష్యత్తుకు బాటలు వేస్తుందని సత్యశోధక్ పాఠశాల ప్రిన్సిపాల్ ఆర్. నర్సయ్య అన్నారు. పాఠశాల నేషనల్ గ్రీన్ కార్ప్స్ (ఎన్ జీసీ) ఎకో క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన వనమహోత్సవ కార్యక్రమంలో ఆయన ఉపాధ్యాయులు, విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు.ఈ సందర్భంగా నర్సయ్య మాట్లాడుతూ... చెట్లు ప్రాణవాయువును అందించడంతో పాటు కాలుష్య నియంత్రణ, వర్షాలు, భూగర్భ జలాల పెంపు, జీవవైవిధ్య పరిరక్షణలో కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. ప్రతి విద్యార్థి ఒక మొక్క నాటి సంరక్షించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు విద్యార్థులకు పర్యావరణ పరిరక్షణ, మొక్కల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, ఎన్‌జీసీ ఎకో క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

## శ్రమదానంతో గురుభక్తి చాటిన భక్తులు

వేల్పూర్, జూలై 28 (ప్రజాశంఖారావం):

వేల్పూర్ మండలంలోని శ్రీ గోవిందగిరి స్వామి దివ్య యోగాశ్రమానికి చెందిన సీతారాంపల్లె వ్యవసాయ క్షేత్రంలో సోమవారం భక్తులు స్వచ్ఛందంగా వరి నాట్లు వేసి గురుభక్తిని చాటుకున్నారు. వెంకటాపూర్ గ్రామానికి చెందిన శ్రీ వేంకటేశ్వర సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో గోవిందగిరి స్వామి శిష్యులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని శ్రమదానం చేశారు. ఈ సందర్భంగా ఆధ్యాత్మికవేత్త శ్రీ రాఘవేంద్ర స్వామి మాట్లాడుతూ, వ్యక్తిగత పనులను పక్కనబెట్టి సేవాభావంతో వ్యవసాయ క్షేత్రంలో శ్రమదానం చేయడం గురుభక్తికి నిదర్శనమని అన్నారు. నిస్వార్థ సేవతో చేసే ప్రతి కార్యానికి శ్రీ గోవిందగిరి స్వామి, జగన్మాత అనుగ్రహం ఎల్లప్పుడూ ఉంటుందని పేర్కొన్నారు. అనంతరం వరి నాట్లలో పాల్గొన్న భక్తులను జ్ఞాపికలతో సత్కరించి, లడ్డూ ప్రసాదాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మెండె పద్మిని–మహేందర్ దంపతులు, కుంట సువర్ణ, వెంకటాపూర్ మల్లవ్వ, ఆలయ కమిటీ సభ్యులు, భక్త సేవకులు, శిష్యులు తదితరులు పాల్గొన్నారు.


## మంచినీటి ట్యాంకుల మంజూరుకు ఎమ్మెల్యేకు వినతి

నిజామాబాద్ రూరల్ సిరికొండ, జూలై 28 (ప్రజాశంఖారావం):



సిరికొండ గ్రామంలో మంచినీటి సమస్య పరిష్కారానికి రెండు 100 కేఎల్ సామర్థ్యం గల నీటి ట్యాంకులు మంజూరు చేయాలని కోరుతూ సిరికొండ సర్పంచ్ మల్లెల సాయి చరణ్ సోమవారం రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. గ్రామంలో ఉన్న 90 వేల లీటర్లు, 40 వేల లీటర్ల మంచినీటి ట్యాంకులు శిథిలావస్థకు చేరుకోవడంతో పాటు ప్రస్తుత అవసరాలకు సరిపోవడం లేదని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. రెండు కొత్త ట్యాంకులు మంజూరు చేస్తే గ్రామంలో తాగునీటి సమస్య తీరుతుందని కోరారు.ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు అల్లిపురం శంకర్, చిట్యాల రంజిత్, బండనపురం నరసయ్య పాల్గొన్నారు.

## శిథిలావస్థలో ఉన్న ఫారెస్ట్ గార్డ్ క్వార్టర్ తొలగించాలి



నిజామాబాద్ రూరల్ సిరికొండ, జూలై 28 (ప్రజాశంఖారావం):

సిరికొండ మండల కేంద్రంలోని పల్లె దవాఖాన (హెల్త్ సబ్ సెంటర్) పక్కన ఉన్న ఫారెస్ట్ గార్డ్ క్వార్టర్ శిథిలావస్థకు చేరుకోవడంతో దానిని తొలగించాలని కోరుతూ సిరికొండ సర్పంచ్ మల్లెల సాయిచరణ్ ఆర్అండ్‌బీ ఈఈని కలిసి వినతిపత్రం అందజేశారు. భవనం పూర్తిగా శిథిలమై విష సర్పాలు సంచరిస్తుండటంతో హెల్త్ సబ్ సెంటర్‌కు వచ్చే ప్రజలు, రోగులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన తెలిపారు. వెంటనే భవనాన్ని తొలగించి సమస్య పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు శంకర్, రంజిత్, ఎల్లయ్య పాల్గొన్నారు.

# ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా బీజేపీ క్రమశిక్షణకు నిదర్శనం

- నైతిక బాధ్యతతోనే పదవికి రాజీనామా చేశారు
- బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్ పటేల్ కులాచారి




నిజామాబాద్ జిల్లా ప్రతినిధి, జూలై 27 (ప్రజాశంఖారావం):

కేంద్ర మాజీ విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తన పదవికి రాజీనామా చేయడం భారతీయ జనతా పార్టీ క్రమశిక్షణ, నైతిక విలువలకు నిదర్శనమని బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్ పటేల్ కులాచారి పేర్కొన్నారు. సోమవారం జిల్లా పార్టీ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, దేశ ప్రయోజనాలే బీజేపీకి అత్యంత ముఖ్యమని, అదే సిద్ధాంతానికి కట్టుబడి ధర్మేంద్ర ప్రధాన్ నైతిక బాధ్యత వహిస్తూ రాజీనామా చేశారని అన్నారు. నీట్ పరీక్ష పేపర్ లీక్ వ్యవహారంలో వ్యక్తిగతంగా ఎలాంటి తప్పు లేకపోయినా బాధ్యత స్వీకరించడం ఆయన నిబద్ధతకు నిదర్శనమని పేర్కొన్నారు. కొంతమంది రాజకీయ పార్టీలు, దేశ వ్యతిరేక శక్తులు ఈ రాజీనామాపై అనవసర వ్యాఖ్యలు చేస్తున్నాయని ఆరోపించారు. విద్యా సంస్కరణల్లో భాగంగా పాఠ్యాంశాల్లో భారత మహనీయుల చరిత్రకు ప్రాధాన్యం కల్పించడంపై కాంగ్రెస్ నాయకులు విమర్శలు చేస్తున్నారని అన్నారు. నీట్ పేపర్ లీక్ ఘటన అనంతరం ప్రధాని నరేంద్ర మోదీ వెంటనే జోక్యం చేసుకుని విద్యార్థులు విద్యా సంవత్సరం కోల్పోకుండా పరీక్షల నిర్వహణకు చర్యలు తీసుకున్నారని చెప్పారు. దీంతో అర్హులైన విద్యార్థులకు న్యాయం జరిగిందని పేర్కొన్నారు. వివిధ రాష్ట్రాల్లో గతంలో జరిగిన పరీక్షల ప్రశ్నాపత్రాల లీకేజీల సందర్భంలో సంబంధిత ప్రభుత్వాలు లేదా మంత్రులు నైతిక బాధ్యత వహించి రాజీనామా చేశారా అని ప్రశ్నించారు. తెలంగాణలో గత ప్రభుత్వ హయాంలో జరిగిన పరీక్షల పేపర్ లీక్ ఘటనల సమయంలో కూడా ఎవరూ బాధ్యత స్వీకరించలేదని విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేపడుతున్న క్యాండిల్ ర్యాలీలను ఆయన విమర్శిస్తూ, రాష్ట్రంలో ఫీజు రీయింబర్స్‌మెంట్, విద్యార్థుల స్కాలర్‌షిప్‌ల వంటి సమస్యలను ముందుగా పరిష్కరించాలని సూచించారు. అలాగే యువతకు అవకాశాలపై చేసిన ప్రకటనలను ఆచరణలో చూపాలని అన్నారు. దేశంలో గత 12 ఏళ్లుగా ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో అవినీతి రహిత పాలన కొనసాగుతోందని, దేశ ప్రజలకు ఆయనపై పూర్తి విశ్వాసం ఉందని పేర్కొన్నారు. సమావేశంలో పొతన్‌కార్ లక్ష్మీనారాయణ, ప్రమోద్‌కుమార్, జ్యోతి, శివప్రసాద్, ఓం సింగ్, కిషోర్, రాము, కల్పే అర్చనా, పిల్లి శ్రీకాంత్, విజయ్, పురుషోత్తం, అన్నం గోపి, గంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణి ఫిర్యాదులను గడువులోగా పరిష్కరించాలి

- కామారెడ్డి కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్
- ప్రజావాణిలో 88 వినతుల స్వీకరణ

కామారెడ్డి, జూలై 27 (ప్రజాశంఖారావం):



ప్రజల సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, ప్రజావాణికి వచ్చే ప్రతి ఫిర్యాదును నిర్దేశిత గడువులోగా పారదర్శకంగా, బాధ్యతాయుతంగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి మొత్తం 88 వినతులను కలెక్టర్ స్వీకరించారు. భూ వివాదాలు, రెవెన్యూ అంశాలు, సంక్షేమ పథకాలు, పింఛన్లు, ఉపాధి, ఇతర శాఖలకు సంబంధించిన సమస్యలను ప్రజలు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. ప్రజావాణి అనంతరం జిల్లా అధికారులు, రెవెన్యూ డివిజనల్ అధికారులు (ఆర్డీవోలు), తహసీల్దార్లతో కలెక్టర్ ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. అందిన ప్రతి దరఖాస్తు పురోగతిని పరిశీలించి, శాఖల వారీగా బాధ్యతాయుతంగా చర్యలు చేపట్టి ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రాధాన్య క్రమంలో సమస్యలను పరిష్కరించి, తీసుకున్న చర్యలపై ఎప్పటికప్పుడు నివేదికలు సమర్పించాలని సూచించారు. ప్రజావాణి ద్వారా ప్రజలకు వేగవంతమైన, పారదర్శకమైన సేవలు అందించేందుకు అన్ని శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) విక్టర్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఎన్.వై. గిరి, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి (సీఈఓ) చందర్, డిప్యూటీ కలెక్టర్ రవితేజ, జిల్లా అధికారులు, ఆర్డీవోలు, తహసీల్దార్లు పాల్గొన్నారు.

## మానవసేవే మాధవసేవ.. సేవాభావమే నిజమైన పూజ

వేల్పూర్, జూలై 28 (ప్రజాశంఖారావం):



వేల్పూర్‌లోని శ్రీ గోవిందగిరి స్వామి దివ్య యోగాశ్రమంలో జరుగుతున్న సప్త భజన మహోత్సవాల్లో భాగంగా సోమవారం ఆరో రోజు కార్యక్రమాలు భక్తిశ్రద్ధల మధ్య నిర్వహించారు. ఈ సందర్భంగా బెంగళూరుకు చెందిన ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణులు, ఆధ్యాత్మిక ప్రవచనకర్త శ్రీ రాఘవేంద్ర స్వామి భక్తులను ఉద్దేశించి ప్రసంగించారు. తోటి మానవులకు చేసే సహాయమే భగవంతునికి చేసే నిజమైన పూజ అని పేర్కొన్నారు. మానవసేవ ద్వారా దయ, ప్రేమ, నిస్వార్థ సేవ అనే గొప్ప మానవ విలువలు ప్రతిఫలిస్తాయని అన్నారు. సప్త భజన మహోత్సవంలో ధర్పల్లి మండలం రామడుగు ప్రాజెక్టు గ్రామానికి చెందిన హనుమాన్ యువజన భక్త భజన మండలి, ఆదర్శ అంకాపూర్ గ్రామానికి చెందిన శ్రీకృష్ణ లీల బృందావనం భక్త భజన మండలి సభ్యులు ఆలపించిన భక్తి గీతాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. గురుతత్వాన్ని వివరిస్తూ వారు ఆలపించిన భజనలు ఆధ్యాత్మిక వాతావరణాన్ని నెలకొల్పాయి. ముప్కాల్ మండలం రెంజర్ల గ్రామానికి చెందిన వన్నెల పద్మ కుటుంబ సభ్యులు గురుపాదుకా పూజ నిర్వహించారు. అనంతరం భజన కళాకారులను ఆలయ కమిటీ సభ్యులు జ్ఞాపికలతో సత్కరించి, లడ్డూ ప్రసాదాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు, సాయి సేవకులు, భజన కళాకారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## రెండు నెలల్లో 90% స్త్రీనిధి రుణాల రికవరీ సాధించాలి

- మెదక్ కలెక్టర్ ప్రతిమా సింగ్

మెదక్, జూలై 27 (ప్రజాశంఖారావం):

జిల్లాలో స్త్రీనిధి రుణాల రికవరీని యుద్ధప్రాతిపదికన చేపట్టి, వచ్చే రెండు నెలల్లో కనీసం 90 శాతం రికవరీ సాధించేలా ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించి అమలు చేయాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అధికారులను ఆదేశించారు. సోమవారం ఐడీఓసీ కార్యాలయంలో నిర్వహించిన జిల్లా స్థాయి స్త్రీనిధి సమీక్ష కమిటీ సమావేశంలో డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీనివాసరావు, అదనపు డీఆర్‌డీఓ సరస్వతి, మెప్మా పీడీ హనుమంతరెడ్డితో కలిసి స్త్రీనిధి రుణాల రికవరీ, పెండింగ్ బకాయిలు, మండలాల వారీ పురోగతిపై కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. రికవరీ శాతం తక్కువగా ఉన్న మండలాల ఏపీఎంలు, మండల సమాఖ్య అధ్యక్షులను కలెక్టర్ నేరుగా ప్రశ్నించి, వెనుకబాటుకు గల కారణాలను విశ్లేషించారు. ఆయా మండలాలకు ప్రత్యేక యాక్షన్ ప్లాన్ రూపొందించి క్షేత్రస్థాయిలో అమలు చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, రాష్ట్రవ్యాప్తంగా స్త్రీనిధి రికవరీలో మెదక్ జిల్లా ప్రస్తుతం 46వ స్థానంలో ఉందని తెలిపారు. అధికారులు బాధ్యతాయుతంగా పనిచేసి రికవరీ పెంపుపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. జిల్లాలో ఉన్న 605 వీవోల పరిధిలో రికవరీ తక్కువగా ఉన్న ప్రాంతాల్లో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి ఇంటింటికీ వెళ్లి రుణగ్రహీతలకు అవగాహన కల్పిస్తూ వసూళ్లను వేగవంతం చేయాలని ఆదేశించారు. వచ్చే రెండు నెలల్లో 90 శాతం రికవరీ లక్ష్యంగా ప్రతి రోజు ఏపీఎంలు, మండల సమాఖ్య అధ్యక్షులు పురోగతి నివేదికలు సమర్పించాలని, రోజువారీ సమీక్షలు నిర్వహించాలని సూచించారు. మెరుగైన పనితీరు కనబరిచిన మండలాలను అభినందిస్తామని, నిర్లక్ష్యం ప్రదర్శించిన వారిపై బాధ్యత నిర్ధారిస్తామని హెచ్చరించారు. మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దే లక్ష్యంతో చిన్న, మధ్యతరహా పరిశ్రమల స్థాపనకు మహిళా సంఘాలను ప్రోత్సహించాలని, వారికి మరిన్ని ఆదాయ వనరులు కల్పించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. స్త్రీనిధి జోనల్ మేనేజర్ టి.వి. రవికుమార్ మాట్లాడుతూ, మండలాల వారీగా ప్రత్యేక రికవరీ ప్రణాళికలు రూపొందించి వీవోలు, ఏపీఎంలు, మండల సమాఖ్యలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. బకాయిలు ఉన్న మహిళా సంఘాల సభ్యులకు అవగాహన కల్పించి అవసరమైతే ప్రత్యేక గ్రామసభలు నిర్వహించాలని, సకాలంలో రుణాలు చెల్లించే సంఘాలను ప్రోత్సహిస్తూనే రికవరీలో వెనుకబడిన మండలాలపై నిరంతర పర్యవేక్షణ కొనసాగిస్తామని తెలిపారు. సమావేశంలో అదనపు డీఆర్‌డీఓ సరస్వతి, స్త్రీనిధి రీజనల్ మేనేజర్ గంగారం, ఏపీఎంలు, మండల సమాఖ్య అధ్యక్షులు, వీవోలు తదితరులు పాల్గొన్నారు.

## అంగడి బజార్ భూమి సమస్యపై ఆర్డీవోకు వినతి



నిజామాబాద్ రూరల్ సిరికొండ, జూలై 27 (ప్రజాశంఖారావం):

సిరికొండ గ్రామంలోని అంగడి బజార్ భూమి సమస్య పరిష్కరించాలని కోరుతూ సిరికొండ గ్రామ పాలకవర్గం, వీడీసీ సభ్యులు ఆర్డీవోను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిరికొండ సర్పంచ్ మల్లెల సాయి చరణ్, వీడీసీ చైర్మన్ దెగం సాయిలు ఆధ్వర్యంలో సభ్యులు అంగడి బజార్ భూమికి సంబంధించిన సమస్యలను ఆర్డీవో దృష్టికి తీసుకెళ్లారు. సమస్యను పరిష్కరించి గ్రామ ప్రజలకు న్యాయం చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు కిషన్, శంకర్, రంజిత్, నరసయ్య, వీడీసీ వైస్ చైర్మన్ శివ, కోశాధికారి గణేష్, ప్రవీణ్, రాజన్న, సతీష్, శోభన్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా అడ్వకేట్ మాడపాటి శివానంద్ జన్మదిన వేడుకలు



కుత్బుల్లాపూర్, జూలై 27 (ప్రజాశంఖారావం):

గాజులరామారం సర్కిల్ మహాదేవపురం డివిజన్ యండమూరి లేఔట్ కాలనీకి చెందిన బీజేపీ లీగల్ సెల్ కన్వీనర్, అడ్వకేట్ మాడపాటి శివానంద్ జన్మదిన వేడుకలు సోమవారం గాజులరామారంలోని ఆయన కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు మూగ జయశ్రీ, మేడ్చల్ అర్బన్ జిల్లా అధ్యక్షుడు మల్లారెడ్డి, రాష్ట్ర ఓబీసీ మోర్చా ప్రధాన కార్యదర్శి నందనం దివాకర్, రాష్ట్ర లీగల్ సెల్ కన్వీనర్ రామారావు, వీణా వరకాల, మధుసూదన్, శ్రీనివాస్, బీజేపీ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ సభ్యుడు బక్క శంకర్‌రెడ్డి, తెలంగాణ బార్ కౌన్సిల్ సభ్యులు, హైకోర్టు అడ్వకేట్స్ అసోసియేషన్ ప్రతినిధులు, వివిధ జిల్లా కోర్టుల న్యాయవాదుల సంఘాల సభ్యులు పాల్గొని శివానంద్‌కు పూలమాలలు వేసి, శాలువాతో సత్కరించి, కేక్ కట్ చేయించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అదేవిధంగా మహాదేవపురం డివిజన్‌లోని పలు కాలనీల సంక్షేమ సంఘాల ప్రతినిధులు, సంగారెడ్డి జిల్లా ప్రజాప్రతినిధులు, వ్యాపారవేత్తలు, హిందూ సంఘాల నాయకులు, కుత్బుల్లాపూర్ నియోజకవర్గానికి చెందిన జర్నలిస్టులు కూడా కార్యక్రమంలో పాల్గొని శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టు, జర్నలిస్టు అసోసియేషన్ కుత్బుల్లాపూర్ నియోజకవర్గ అధ్యక్షుడు సుగ్రీవుడు ముదిరాజ్‌తో పాటు సీనియర్ జర్నలిస్టులు భాన్స్వాడ వెంకటేష్, గణేష్, బాలరాజ్, కేఎస్ రాజు, బక్కని పాండు ముదిరాజ్, యాకూబ్, శివకుమార్, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు. వేడుకలు ఆత్మీయ వాతావరణంలో సాగగా, హాజరైన ప్రముఖులు అడ్వకేట్ మాడపాటి శివానంద్ సామాజిక సేవలను అభినందిస్తూ, భవిష్యత్తులో మరింత ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు.

## బాబానగర్‌లో కమ్యూనిటీ సోక్‌పిట్‌కు భూమిపూజ



**భీంగల్, జూలై 28 (ప్రజాశంఖారావం):**

భీంగల్ మండలం బాబానగర్ గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఆవరణలో వి.బి.జి.ఆర్.ఏ.ఎం.జి పథకం కింద నిర్మించనున్న కమ్యూనిటీ సోక్‌పిట్‌కు సోమవారం ఎంపీడీవో గంగుల సంతోష్‌కుమార్ భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, భూగర్భ జలాల పరిరక్షణ, వర్షపు నీటి సంరక్షణకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. ప్రతి గ్రామంలో రైతుల పొలాల్లో ఐదు ఫారం పాండ్లు నిర్మించాలని, ప్రతి ఇంటికి ఇంకుడు గుంత ఏర్పాటు చేసుకోవాలని, బోర్‌వెల్ రీఛార్జ్ నిర్మాణాలను విస్తృతంగా చేపట్టాలని గ్రామస్తులకు సూచించారు. నీటి వనరులను సంరక్షించడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని పేర్కొంటూ, గ్రామస్థులంతా ప్రభుత్వ కార్యక్రమాల్లో భాగస్వాములై జల సంరక్షణ చర్యలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్, ఉపసర్పంచ్, వార్డు సభ్యులు, పంచాయతీ కార్యదర్శి, ఫీల్డ్ అసిస్టెంట్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణి ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి



**మెదక్, జూలై 27 (ప్రజాశంఖారావం):**

ప్రజావాణి కార్యక్రమానికి వచ్చే ప్రజా సమస్యలను సత్వరమే పరిశీలించి పరిష్కరించాలని జిల్లా అదనపు కలెక్టర్ నగేష్ సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి వినతిపత్రాలను స్వీకరించారు. ప్రజావాణిలో భూభారతికి సంబంధించిన 37, పెన్షన్లకు 4, ఇందిరమ్మ ఇళ్లకు 7, ఇతర సమస్యలకు సంబంధించిన 34 దరఖాస్తులు కలిపి మొత్తం 82 వినతులు అందాయి. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజావాణికి వచ్చిన ప్రతి దరఖాస్తును సంబంధిత శాఖల అధికారులు వెంటనే పరిశీలించి, నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని సూచించారు. ప్రజల సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం ప్రదర్శించకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని అధికారులను ఆదేశించారు.

## నడవలేని వృద్ధుడి వ్యథకు ఎస్పీ స్పందన



**మెదక్, జూలై 27 (ప్రజాశంఖారావం):**

మెదక్ జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో నడవలేని స్థితిలో వచ్చిన ఓ వృద్ధుడి సమస్యకు జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు, ఐపీఎస్ వెంటనే స్పందించి మానవత్వాన్ని చాటుకున్నారు. నర్సాపూర్ మండలం రెడ్డిపల్లి గ్రామానికి చెందిన భద్రయ్య (75) నడవలేని పరిస్థితిలో పోలీస్ కార్యాలయానికి రావడాన్ని రిసెప్షన్ సిబ్బంది సరిత గమనించి వెంటనే ఎస్పీ దృష్టికి తీసుకెళ్లారు. విషయం తెలుసుకున్న ఎస్పీ తన కార్యాలయం నుంచి బయటకు వచ్చి వృద్ధుడి వద్దకే వెళ్లి ఆప్యాయంగా పలకరిస్తూ ఆయన సమస్యను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా భద్రయ్య మాట్లాడుతూ, తనకు చెందిన 36 గుంటల భూమిని తన ఇద్దరు కుమారులు నోముల రాజు, నోముల శ్రీనివాస్ తనకు తెలియకుండా తమ పేర్లపై అక్రమంగా పట్టా పుస్తకాలు చేయించుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే తన కుమార్తె లావణ్యను ఖాళీ స్టాంప్ పేపర్లపై సంతకాలు చేయాలని ఒత్తిడి చేస్తున్నారని, తనను సరిగా చూసుకోవడం లేదని, అన్నం కూడా పెట్టడం లేదని కన్నీటి పర్యంతమయ్యారు. వృద్ధుడి బాధను సానుభూతితో విన్న జిల్లా ఎస్పీ వెంటనే స్పందించి, ఫిర్యాదుపై సమగ్ర విచారణ జరిపి బాధితుడికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని నర్సాపూర్ ఎస్ఐ రంజిత్‌రెడ్డికి ఫోన్ ద్వారా ఆదేశించారు. బాధితులుగా ఉన్న ప్రతి ఒక్కరికీ పోలీస్ శాఖ అండగా ఉంటుందని, ప్రజల సమస్యల పరిష్కారంలో ఎల్లప్పుడూ బాధ్యతాయుతంగా వ్యవహరిస్తామని జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు తెలిపారు.

## ముగ్గురు ఏఎస్సైలకు ఎస్సైలుగా పదోన్నతి

**మెదక్, జూలై 27 (ప్రజాశంఖారావం):**



మెదక్ జిల్లాలోని వివిధ పోలీస్‌స్టేషన్లలో అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్లుగా (ఏఎస్సైలు) విధులు నిర్వహిస్తున్న రాంబాబు, జైపాల్‌రెడ్డి, కృష్ణమూర్తిలకు సబ్ ఇన్‌స్పెక్టర్లుగా (ఎస్సైలు) పదోన్నతి లభించింది. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు, ఐపీఎస్ పదోన్నతి పొందిన అధికారులకు ఎస్సై ర్యాంక్ చిహ్నాలను అలంకరించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, పదోన్నతి అనేది గౌరవంతో పాటు బాధ్యతలను కూడా పెంచుతుందని అన్నారు. అధికారులు విధి నిర్వహణలో అంకితభావం, నిజాయితీ, క్రమశిక్షణతో పనిచేస్తూ ప్రజల విశ్వాసాన్ని మరింత పెంపొందించాలని సూచించారు. శాంతిభద్రతల పరిరక్షణలో పోలీస్ శాఖ కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొంటూ, ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి వారి సమస్యలను సత్వరమే పరిష్కరించేలా పనిచేయాలని సూచించారు. నూతన బాధ్యతల్లో సమర్థవంతంగా రాణిస్తూ పోలీస్ శాఖకు, సమాజానికి మరింత మెరుగైన సేవలు అందించాలని ఆకాంక్షించారు.

# వరి వద్దు.. ఆరుతడి పంటలు వేయండి

- ఇంటిగ్రేటెడ్ వ్యవసాయంతో రైతులు అధిక ఆదాయం పొందాలి
- నాణ్యమైన విత్తనాలు, ఎరువులకు కొరత లేదు
- జిల్లా యంత్రాంగం పూర్తి సహకారం
- మెదక్ కలెక్టర్ ప్రతిమా సింగ్



**మెదక్, జూలై 27 (ప్రజాశంఖారావం):**

ప్రస్తుత ఎల్‌నినో ప్రభావంతో నెలకొన్న వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని అధిక నీరు అవసరమయ్యే వరి సాగుకు బదులుగా తక్కువ నీటితో సాగు చేసే ఆరుతడి, ప్రత్యామ్నాయ పంటలను రైతులు విస్తృతంగా సాగు చేయాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ పిలుపునిచ్చారు. సోమవారం కౌడిపల్లి మండల కేంద్రంలోని రైతు వేదికలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన విత్తన మేళాను నర్సాపూర్ ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డితో కలిసి ప్రారంభించారు. అనంతరం వివిధ శాఖలు ఏర్పాటు చేసిన స్టాళ్లను సందర్శించి రైతులతో మాట్లాడారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, నేల స్వభావం, వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటలను ఎంపిక చేసుకుంటే పెట్టుబడి తగ్గడంతో పాటు దిగుబడి, ఆదాయం కూడా పెరుగుతాయని అన్నారు. ప్రభుత్వం రైతులకు ధ్రువీకరించిన నాణ్యమైన విత్తనాలను సరసమైన ధరలకు అందుబాటులో ఉంచిందని, రైతులు విత్తన మేళాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రస్తుత పరిస్థితుల్లో సమీకృత (ఇంటిగ్రేటెడ్) వ్యవసాయం అవసరమని పేర్కొంటూ, వ్యవసాయంతో పాటు ఉద్యానవన పంటలు, పశుసంవర్ధక రంగం, కూరగాయల సాగును సమన్వయంతో చేపడితే రైతులకు ఏడాది పొడవునా ఆదాయం లభిస్తుందని వివరించారు. ఒకే పంటపై ఆధారపడకుండా పంటల వైవిధ్యాన్ని పెంచుకోవడం ద్వారా ప్రకృతి వైపరీత్యాల ప్రభావాన్ని తగ్గించుకోవచ్చని తెలిపారు. కూరగాయల సాగు ద్వారా రైతులు మంచి లాభాలు పొందుతున్నారని, మార్కెట్ అవసరాలకు అనుగుణంగా ఉద్యానవన పంటలు సాగు చేస్తే ఆదాయం మరింత పెరుగుతుందని చెప్పారు. పశుసంపద అభివృద్ధికి అవసరమైన మేత పంటల సాగుపై ప్రభుత్వం 75 శాతం సబ్సిడీ అందిస్తోందని, రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. ప్రతి గ్రామంలోని వ్యవసాయ విస్తరణ అధికారులు (ఏఈఓలు) ప్రత్యామ్నాయ పంటలు, ఉద్యానవన పంటలు, ఆధునిక సాగు పద్ధతులపై రైతులకు నిరంతరం అవగాహన కల్పించాలని ఆదేశించారు. రైతులకు డ్రిప్ ఇరిగేషన్, నాణ్యమైన విత్తనాలు, సాంకేతిక సలహాలు సకాలంలో అందేలా వ్యవసాయ, ఉద్యానవన శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. జిల్లాలో నాణ్యమైన విత్తనాలు, ఎరువులకు ఎలాంటి కొరత లేదని, రైతులకు అవసరమైన ప్రతి విషయంలో జిల్లా యంత్రాంగం పూర్తి సహకారం అందిస్తుందని కలెక్టర్ భరోసా ఇచ్చారు. జిల్లాలోని రైతులు ఆధునిక వ్యవసాయ పద్ధతులను అవలంబించి రాష్ట్రానికి ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా నర్సాపూర్ ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి మాట్లాడుతూ, నియోజకవర్గంలో వర్షపాతం తక్కువగా నమోదవుతున్నందున ప్రత్యామ్నాయ పంటల సాగుపై రైతులు దృష్టి సారించాలని సూచించారు. ఈ పంటలపై మరింత విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని అధికారులను కోరారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి దేవకుమార్, నర్సాపూర్ ఆర్డీవో రామకృష్ణ, వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## తేనెటీగలు, పుట్టగొడుగుల పెంపకంతో రైతులు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి



**మెదక్, జూలై 27 (ప్రజాశంఖారావం):**

తేనెటీగలు, పుట్టగొడుగుల పెంపకం ద్వారా రైతులు, గ్రామీణ యువత పారిశ్రామికవేత్తలుగా ఎదిగే అవకాశాలు మెండుగా ఉన్నాయని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అన్నారు. సోమవారం కౌడిపల్లి మండల కేంద్రంలోని రైతు మహిపాల్‌రెడ్డి వ్యవసాయ క్షేత్రంలో ఉద్యానవన, పట్టు పరిశ్రమ శాఖల ఆధ్వర్యంలో నిర్వహించిన తేనెటీగలు, పుట్టగొడుగుల పెంపకంపై అవగాహన సదస్సును నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డితో కలిసి కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల్లో రైతులు, మహిళలు, నిరుద్యోగ యువతకు అదనపు ఆదాయం, ఆర్థిక భద్రత కల్పించే లక్ష్యంతో ప్రభుత్వం సబ్సిడీలు, శాస్త్రీయ శిక్షణ అందిస్తోందన్నారు. మార్కెట్‌లో తేనె, పుట్టగొడుగులకు పెరుగుతున్న డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని రైతులు ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి మాట్లాడుతూ, తక్కువ పెట్టుబడితో కుటీర పరిశ్రమగా తేనెటీగలు, పుట్టగొడుగుల పెంపకాన్ని చేపట్టి రైతులు అదనపు ఆదాయం పొందవచ్చని అన్నారు. ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహక పథకాలను వినియోగించుకుని ఆదాయ వనరులను విస్తరించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఉద్యానవన, పట్టు పరిశ్రమ శాఖ అధికారి ప్రతాప్‌సింగ్, డీఆర్‌డీఓ శ్రీనివాసరావు, ప్రజాప్రతినిధులు, వివిధ గ్రామాల రైతులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## బాలికను వేధించిన యువకుడికి ఏడాది జైలు

**మెదక్, జూలై 27 (ప్రజాశంఖారావం):**

ఇంటర్మీడియట్ చదువుతున్న బాలికను వేధిస్తూ, పెళ్లి చేసుకుంటానంటూ ప్రేమలేఖ రాసి అనంతరం బాధిత కుటుంబాన్ని బెదిరించిన కేసులో నిందితుడికి ఏడాది జైలు శిక్షతో పాటు రూ.20 వేల జరిమానా విధిస్తూ ఫాస్ట్‌ట్రాక్ పోక్సో కోర్టు తీర్పు వెలువరించినట్లు మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు, ఐపీఎస్ తెలిపారు. పోలీసుల వివరాల ప్రకారం.. టిప్పర్ డ్రైవర్‌గా పనిచేస్తున్న చాకలి కుమార్ (21) ఇంటర్మీడియట్ చదువుతున్న ఓ బాలికను వెంటపడుతూ, ఆమెను వివాహం చేసుకుంటానంటూ ప్రేమలేఖ రాశాడు. ఆ లేఖను బాలికకు అందజేయాలని తన స్నేహితుడు మహేష్‌కు ఇచ్చాడు. ఈ విషయాన్ని బాలిక తన తల్లిదండ్రులకు తెలియజేయగా, వారు గ్రామ పెద్దల దృష్టికి తీసుకెళ్లారు. గ్రామ పెద్దలు ప్రశ్నించగా లేఖ తానే రాసినట్లు కుమార్ అంగీకరించాడు. ఈ ఘటనపై ఆగ్రహం చెందిన కుమార్ 2023 ఫిబ్రవరి 19న సాయంత్రం బాధితురాలి తల్లిదండ్రులను అసభ్య పదజాలంతో దూషించి, చంపేస్తానంటూ బెదిరించాడు. దీంతో బాధిత కుటుంబ సభ్యులు శివంపేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, అప్పటి ఎస్ఐ, దర్యాప్తు అధికారి రవికాంత్ రావు కేసు నమోదు చేసి సమగ్ర దర్యాప్తు అనంతరం కోర్టులో ఛార్జిషీట్ దాఖలు చేశారు. విచారణ సందర్భంగా పబ్లిక్ ప్రాసిక్యూటర్ బాలయ్య వాదనలు వినిపించగా, పూర్తి సాక్ష్యాధారాలను పరిశీలించిన ఫాస్ట్‌ట్రాక్ పోక్సో కోర్టు న్యాయమూర్తి ఆర్.ఎం. సుభావాలి నిందితుడు చాకలి కుమార్‌కు ఏడాది జైలు శిక్షతో పాటు రూ.20 వేల జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారు. ఈ కేసులో సమర్థవంతంగా సమన్వయం చేసిన ఎస్ఐ విఠల్, కానిస్టేబుల్ కృష్ణ, సీడీఓ ఆనంద్, భరోసా లీగల్ అడ్వైజర్ శ్వేతాను జిల్లా ఎస్పీ అభినందించారు.

## చేగుంట రైతు వేదికలో ఘనంగా 'విత్తన మేళా'



**చేగుంట, జూలై 27 (ప్రజాశంఖారావం):**

మెదక్ జిల్లా, చేగుంట మండల కేంద్రంలోని రైతు వేదికలో వరి సాగుకు ప్రత్యామ్నాయంగా లాభదాయకమైన ఇతర పంటల వైపు రైతులను ప్రోత్సహించడమే లక్ష్యంగా 'విత్తన మేళా'ను హరి ప్రసాద్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. సాంప్రదాయ వరి పంట స్థానంలో తక్కువ నీటితో, తక్కువ పెట్టుబడితో అధిక ఆదాయం అందించే కంది, మొక్కజొన్న, వివిధ రకాల కూరగాయల విత్తనాలను ఈ మేళాలో రైతులకు అందుబాటులో ఉంచగా, రైతులు కేవలం వరిపైనే ఆధారపడకుండా లాభసాటి ప్రత్యామ్నాయ పంటలు, కూరగాయల సాగుపై దృష్టి సారించాలని వ్యవసాయ అధికారులు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి హరిప్రసాద్, వ్యవసా విస్తరణ అధికారి మాధవిలతో పాటు చేగుంట మండలంలోని వివిధ ఫెర్టిలైజర్ షాపుల యజమా నులు, స్థానిక రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## జలసిరి పనులతో భూగర్భ జలాల పెంపు



**చేగుంట,జూలై 27 (ప్రజాశంఖారావం):**

మెదక్ జిల్లా, చేగుంట మండలం, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ జలసిరి వి బి జి ఆర్ ఏ ఎం జి పథకంలో భాగంగా భూగర్భ జలమట్టాలను పెంచే లక్ష్యంతో సోమవారం చేగుంట మండల పరిధిలోని బోనాల, కొండాపూర్ (బోనాల), గొల్లపల్లి, జైత్రం తండా, ఉల్లితిమ్మాయిపల్లి మరియు కర్నాల్‌పల్లి గ్రామాల్లో ప్రత్యేక గ్రామసభలు నిర్వహించారు. ఈ సభల్లో చేగుంట ఎంపీడీఓ టీ. చిన్నారెడ్డి, ఎంపీఓ ప్రకాష్, ఏపీఓ శ్వేత పాల్గొని భూగర్భ జలాల పునరుద్ధరణకు చేపట్టాల్సిన ఇంకుడు గుంతలు, ఫామ్ పౌండ్లు, బోర్వెల్ రీఛార్జ్, కమ్యూనిటీ సోక్ పీట్లు, మ్యాజిక్ డ్రైన్ వంటి పనుల ప్రాముఖ్యతను ప్రజలకు వివరించారు. ఈ గ్రామసభల్లో ఆయా గ్రామాల సర్పంచ్‌లు, పాలకవర్గ సభ్యులు, పంచాయతీ కార్యదర్శులు మరియు స్వయం సహాయక సంఘాల ( ఎస్ హెచ్ జి ) మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## భీంగల్‌లో వర్ధన్ హెల్త్ కేర్ స్పెషాలిటీ హాస్పిటల్ ప్రారంభం

**భీంగల్, జూలై 27 (ప్రజాశంఖారావం):**



భీంగల్ మండల కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన వర్ధన్ హెల్త్ కేర్ స్పెషాలిటీ హాస్పిటల్ ప్రారంభోత్సవ కార్యక్రమం ఆదివారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ ముత్యాల సునీల్‌కుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన ఆసుపత్రిని ప్రారంభించి వైద్య సదుపాయాలను పరిశీలించారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందుబాటులోకి రావడం అభినందనీయమని పేర్కొన్నారు. ఆధునిక వైద్య సదుపాయాలతో ప్రజలకు మెరుగైన చికిత్స అందిస్తూ ఆసుపత్రి సేవా కార్యక్రమాలు విజయవంతంగా కొనసాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, వైద్యులు, ఆసుపత్రి యాజమాన్యం, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## పల్లికొండ వాసికి రూ.3 లక్షల ఎల్‌ఓసీ మంజూరు

**భీంగల్, జూలై 28 (ప్రజాశంఖారావం):**

భీంగల్ మండలం పల్లికొండ గ్రామానికి చెందిన చిలివేరి నాగేష్ తీవ్ర అనారోగ్యంతో హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా, ఆయన వైద్య చికిత్స కోసం ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) ద్వారా రూ.3 లక్షల విలువైన లెటర్ ఆఫ్ క్రెడిట్ (ఎల్ఓసీ) మంజూరైంది. వైద్యులు శస్త్రచికిత్స అవసరమని సూచించడంతో బాధిత కుటుంబ సభ్యులు బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ముత్యాల సునీల్‌కుమార్‌ను సంప్రదించారు. దీనిపై స్పందించిన ఆయన ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా రూ.3 లక్షల ఎల్ఓసీ మంజూరు చేయించి, సంబంధిత పత్రాలను కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబ సభ్యులు తమ క్లిష్ట సమయంలో వెంటనే స్పందించి వైద్య సహాయం అందించిన ముత్యాల సునీల్‌కుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు

# త్వరలోనే రాకా షూటింగ్‌లోకి..

ఐకాన్ స్టార్ అల్లు అర్జున్, స్టార్ డైరెక్టర్ అట్లీ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న ప్రతిష్ఠాత్మక పాన్-ఇండియా చిత్రం రాకా పై అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. కొత్త షూటింగ్ షెడ్యూల్‌కు సంబంధించిన ఆసక్తికరమైన వార్త సినీ వర్గాల్లో చక్కర్లు కొడుతోంది. తాజా సమాచారం ప్రకారం, చిత్రబృందం త్వరలో ప్రారంభం కానున్న కొత్త షెడ్యూల్‌లో అల్లు అర్జున్ ఇంట్రడక్షన్ సీన్ చిత్రీకరించనుంది. ఈ సీన్‌ను సినిమాకే హైలైట్‌గా నిలిచేలా అత్యంత భారీ స్థాయిలో ఎ÷-లాన్ చేసినట్లు తెలుస్తోంది.ఈ ఎపిసోడ్ కోసం ప్రత్యేకంగా భారీ సెట్‌ను నిర్మించినట్లు సమాచారం. అట్లీ మార్క్ స్టైలిష్ విజువల్స్, హై వోల్టేజ్ యాక్షన్‌తో బన్నీ ఎంట్రీ ప్రేక్షకులకు గూస్‌బంప్స్ ఇచ్చేలా ఉండబోతుందనే టాక్ వినిపిస్తోంది. ఈ చిత్రంలో అల్లు అర్జున్ ఇప్పటివరకు కనిపించని వైల్డ్ అండ్ రగ్గడ్ లుక్లో కనిపించనున్నారని ఇండస్ట్రీ వర్గాలు చెబుతున్నాయి. ముఖ్యంగా ఇంట్రడక్షన్ సీన్‌లో ఆయన మేకోవర్, బాడీ లాంగ్వేజ్, యాక్షన్ స్టైల్ అభిమానులను ఆశ్చర్యపరిచేలా ఉంటాయని సమాచారం. 'పుష్ప' తర్వాత మరోసారి పూర్తిగా భిన్నమైన పాత్రలో బన్నీ కనిపించనున్న నేపథ్యంలో ఈ సినిమాపై అంచనాలు మరింత పెరిగాయి. 'రాకా'లో హీరోయిన్‌గా బాలీవుడ్ స్టార్ దీపికా పదుకొణె నటిస్తున్న సంగతి తెలిసిందే. ఆమెతో పాటు మృణాల్ ఠాకూర్, జాన్వీ కపూర్ కూడా కీలక పాత్రల్లో కనిపించనున్నారని ప్రచారం జరుగుతోంది. ముగ్గురు స్టార్ హీరోయిన్లు ఒకే సినిమాలో భాగం కావడం ఈ ప్రాజెక్ట్‌కు మరో ప్రత్యేక ఆకర్షణగా మారింది. సినీ వర్గాల్లో వినిపిస్తున్న సమాచారం ప్రకారం, 'రాకా' కథ మాఫియా ప్రపంచం చుట్టూ తిరుగుతుందని తెలుస్తోంది. ఓ శక్తివంతమైన డాన్ జీవితాన్ని కేంద్రంగా చేసుకుని యాక్షన్, ఎమోషన్స్, థ్రిల్లింగ్ మలుపులతో కథ సాగనున్నట్లు ప్రచారం జరుగుతోంది. అట్లీ తన గత చిత్రాల మాదిరిగానే కమర్షియల్ ఎలిమెంట్స్‌తో పాటు భారీ విజువల్ ట్రీట్‌ను అందించేందుకు సిద్ధమవుతున్నారని సమాచారం. ఈ ప్రతిష్ఠాత్మక చిత్రాన్ని ప్రముఖ నిర్మాణ సంస్థ సన్ పిక్చర్స్ అత్యంత భారీ బ్జడెట్‌తో నిర్మిస్తోంది.







# ఆదర్శ కుటుంబంలో చిట్టిబాబు గ్లింప్స్ విడుదల

టాలీవుడ్ యాక్టర్ వెంకటేశ్, స్టార్ డైరెక్టర్ త్రివిక్రమ్ శ్రీనివాస్ కాంబోలో వస్తున్నచిత్రం 'ఆదర్శ కుటుంబం' వెంకీ 77వ చిత్రంగా తెరకెక్కుతున్న ఈ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌ను గాంధీ జయంతి సందర్భంగా, అక్టోబర్ 2వ తేదీన ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల చేస్తున్నట్టు ప్రకటించారని తెలిసిందే. ప్రతి కుటుంబం గుర్తుపెట్టుకోవాల్సిన తేదీ.. అక్టోబర్ 2న ఆదర్శ కుటుంబం తలుపులు తెరుచుకోబోతున్నాయి..అంటూ మేకర్స్ హైప్ పెంచేస్తున్నారు. తాజాగా ప్రమోషన్స్‌లో భాగంగా వెంకీ పోషిస్తున్న చిట్టిబాబు పాత్ర గ్లింప్స్‌ను షేర్ చేశారు. కిచెన్‌లో ఏసీనా.. నాన్న నువ్వు వంట చేసేటప్పుడు హ్యాపీగా ఏసీ వేసుకుని చేసుకోవచ్చు. అవును నేను మ్యాన్ ఆఫ్ ది హౌస్. వాషింగ్ మెషిన్ కూడా ఉంది.. నీకు పని బాగా తగ్గిపోయినట్టేనని శ్రీనిధి శెట్టి అంటున్న డైలాగ్స్‌తో షురూ అయింది గ్లింప్స్. చిట్టిగారు అని రఘుబాబు అంటుంటే అస్తమానం తలతిప్పకండి బుజ్జిగారు మెడ పట్టేస్తుంది.. నాకు ఎవరేం పని చేసినా నచ్చదు. అందుకే అన్నీ నేనే చూసుకుంటానంటున్నాడు వెంకీ.. ఆదర్శ కుటుంబం అంటూ నారా రోహిత్ డైలాగ్స్‌తో ఎండ్ అయింది గ్లింప్స్. మొత్తానికి చిట్టిబాబుగా వెంకీ అండ్ ఫ్యామిలీ పక్కా వినోదాన్నిఅందించబోతుందని తాజా గ్లింప్స్ చెప్పకనే చెబుతోంది. ఈ చిత్రంలో కేజీఎఫ్ ఫేమ్ శ్రీనిధి శెట్టి హీరోయిన్‌గా నటిస్తోంది. హారిక అండ్ హాసిని క్రియేషన్స్ బ్యానర్‌పై సూర్యదేవర రాధాకృష్ణ (చినబాబు), వంశీ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ మూవీకి స్టార్ మ్యూజిక్ డైరెక్టర్ థమన్ సంగీతం అందిస్తున్నాడు. వెంకటేష్, త్రివిక్రమ్ కాంబోలో వస్తున్న మొదటి ఫుల్ లెంగ్త్ సినిమా కావడంతో అంచనాలు భారీగానే నెలకొన్నాయి.


## 52 ఏళ్ల వయసులోనూ

# తగ్గేదేలే..

బాలీవుడ్ గ్లామరస్ బ్యూటీ మలైకా అరోరా తన వ్యక్తిగత జీవితంతో నిత్యం వార్తల్లో నిలుస్తుంటారు. సినిమాల కంటే ప్రేయ వ్యవహారాల కారణంగానే సోషల్ మీడియాను షేక్ చేస్తుంటారు. యంగ్ హీరో అర్జున్ కపూర్‌తో సుదీర్ఘ బంధానికి స్వస్తి చెప్పిన తర్వాత, ఆమె లైఫ్‌లోకి మరో కొత్త వ్యక్తి ఎంట్రీ ఇచ్చారనే వార్త ఇప్పుడు బాలీవుడ్‌లో హాట్ టాపిక్‌గా మారింది. తాజా సమాచారం ప్రకారం.. మలైకా ప్రముఖ డైమండ్ వ్యాపారి హర్ష్ మెహతాతో డేటింగ్‌లో ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. ఇటీవల ముంబైలోని బాంద్రాలో జరిగిన ఒక గ్రాండ్ ప్రైవేట్ పార్టీకి మలైకా తన కొడుకు అర్హాన్ ఖాన్‌తో కలిసి హాజరయ్యారు. అదే పార్టీలో హర్ష్ మెహతా కూడా సందడి చేయడంతో వీరిద్దరి రిలేషన్‌షిప్‌పై వచ్చే రూమర్లకు మరింత బలం చేకూరింది. 52 ఏళ్ల మలైకా, తనకంటే 19 ఏళ్లు చిన్నవాడైన హర్ష్ మెహతాతో డేటింగ్ చేయడంపై సోషల్ మీడియా వేదికగా విపరీతమైన ట్రోలింగ్ జరుగుతోంది. గతంలో తనకంటే 12 ఏళ్లు చిన్నవాడు అర్జున్ కపూర్ విషయంలో ఎదుర్కొన్న విమర్శల తరహాలోనే, ఇప్పుడు కూడా నెటిజన్లు రకరకాల కామెంట్స్ చేస్తున్నారు.



# అఖిల్ వ్యక్తిగత జీవితంపై ట్రోలింగ్



## జైన్ కులం, మతంపై విమర్శలు..

## పట్టించుకోని యువనటుడు

అక్కినేని హీరో అఖిల్ అక్కినేని తన వ్యక్తిగత జీవితంపై వచ్చిన ట్రోలింగ్‌కు తొలిసారి ఘాటుగా స్పందించారు. గతేడాది తన ప్రేయసి జైనబ్‌ని వివాహం చేసుకున్న తర్వాత సోషల్ మీడియాలో ఆమె వయసు, మతంపై వచ్చిన విమర్శలను తాము ఏమాత్రం పట్టించుకోలేదని స్పష్టం చేశారు. ప్రేమ, పరస్పర అవగాహన, ఒకరిపై ఒకరికి ఉన్న నమ్మకమే తమ బంధానికి అసలైన బలమని చెప్పారు. 'లెనిన్' సినిమాతో కెరీర్‌లోనే అతిపెద్ద విజయాన్ని అందుకున్న అఖిల్, ఓ తాజా పోడ్‌కాస్ట్ ఇంటర్వ్యూలో తన వ్యక్తిగత జీవితానికి సంబంధించిన పలు విషయాలను పంచుకున్నారు. పెళ్లి తర్వాత సోషల్ మీడియాలో వచ్చిన నెగెటివ్ కామెంట్స్ గురించి అడగగా.. అలాంటి విషయాలకు తాము అసలు ప్రాధాన్యం ఇవ్వలేదని తెలిపారు. కొన్ని రోజుల పాటు సోషల్ మీడియాలో వచ్చే కామెంట్స్ గురించి ఆలోచించాలా? లేక జీవితాంతం నాతో ఉండే వ్యక్తితో సంతోషంగా జీవించడం గురించి ఆలోచించాలా? నాకు రెండోది ముఖ్యమైంది. అందుకే ట్రోలింగ్‌ను ఎప్పుడూ సీరియస్‌గా తీసుకోలేదని అఖిల్ అన్నారు.పెళ్లికి ముందే తమ జీవితంలో ఇలాంటి విమర్శలు వస్తాయని జైనబ్‌కు చెప్పినట్లు అఖిల్ వెల్లడించారు.నేను నటుడిని. నా జీవితంలోకి వచ్చిన తర్వాత సోషల్ మీడియాలో విమర్శలు తప్పవు. అందుకు సిద్ధంగా ఉండాలని నేను ముందుగానే చెప్పాను. ఆమె కూడా చాలా పరిణతితో అర్థం చేసుకుంది. వయసు, మతం గురించి వచ్చిన కామెంట్లను ఎంతో పాజిటివ్‌గా తీసుకుంది. అదే నాకు మరింత ధైర్యాన్ని ఇచ్చింది అని తెలిపారు. తన కెరీర్‌లో అత్యంత క్లిష్టమైన సమయంలో జైనబ్ తనకు అండగా నిలిచిందని అఖిల్ భావోద్వేగంగా చెప్పారు. ప్రేమలో కులం, మతం, వయసు కంటే పరస్పర అవగాహన, నమ్మకం ముఖ్యమని అఖిల్ అభిప్రాయపడ్డారు. పెళ్లికి ముందు ఒకరినొకరు పూర్తిగా అర్థం చేసుకోవాలని యువతకు సూచించారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY PUTTI MURALI, PRINTED AT INDUR OFFSET PRINTERS, OPP : CHEER HANUMAN TEMPLE, WEEKLY BAZAR,NIZAMABAD- 503001, NIZAMABAD DISTRICT, TELANGANA STATE, PUBLISHED AT HNO.1-86/10/05, KOTARMOOR(PERKIT), ARMOOR-503224, NIZAMABAD DISTRICT, TELANGANA STATE. EDITOR : PUTTI MURALI, TELTEL/2022/85170, EMAIL :prajashankaravam@gmail.com

ప్రజా శంఖారావం
PRAJA SHANKARAVAM
మంగళవారం
జూలై 28, 2026
epaper.prajashankaravam.com
www.prajashankaravam.com

# ఆధార్ వివరాలు తప్పనిసరిగా నమోదు చేసుకోవాలి

- 0-5 ఏళ్ల చిన్నారులకు తొలి నమోదు ఉచితం
- సంక్షేమ పథకాల ప్రయోజనాలకు ఆధార్ వివరాలు సక్రమంగా ఉండాలి
- మెదక్ అదనపు కలెక్టర్ నగేశ్




**మెదక్, జూలై 27 (ప్రజాశంఖారావం):**

ప్రతి పౌరుడు తమ ఆధార్‌లోని వివరాలను తప్పనిసరిగా నమోదు చేసుకుని, అవసరమైతే సకాలంలో నవీకరించుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ నగేష్ సూచించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఈ-డిస్ట్రిక్ట్ అధికారులు, ఆధార్ నమోదు కేంద్రాల నిర్వాహకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాల ప్రయోజనాలను పొందాలంటే ఆధార్‌లోని పేరు, జన్మతేదీ, చిరునామా, మొబైల్ నంబర్, ఇ-మెయిల్ (ఉన్నట్లయితే), బయోమెట్రిక్ వివరాలు తదితర సమాచారం సక్రమంగా ఉండాలని తెలిపారు. బ్యాంకింగ్ సేవలు, విద్యా సంస్థల్లో ప్రవేశాలు, ఉపాధి అవకాశాలు, ఆరోగ్య సేవలు, పింఛన్లు, రేషన్, విద్యార్థుల స్కాలర్‌షిప్‌లు, రైతులకు అందించే ఆర్థిక సహాయాలు తదితర ప్రభుత్వ సేవలన్నింటికీ ఆధార్ కీలక గుర్తింపు పత్రంగా ఉపయోగపడుతోందని పేర్కొన్నారు. ప్రత్యేకించి చిన్నారులు, విద్యార్థులు, వృద్ధులు, దివ్యాంగులు, మహిళలు, ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధిదారులు తమ ఆధార్ వివరాలు సక్రమంగా ఉన్నాయో లేదో ఒకసారి పరిశీలించుకోవాలని సూచించారు. ఆధార్‌కు మొబైల్ నంబర్ అనుసంధానం చేసుకుంటే ఓటీపీ ఆధారిత సేవలను సులభంగా వినియోగించుకోవచ్చని తెలిపారు. 0 నుంచి 5 సంవత్సరాల పిల్లలకు, తొలిసారిగా ఆధార్ నమోదు చేసుకునే వారికి ఉచితంగా ఆధార్ నమోదు చేస్తున్నట్లు తెలిపారు. అలాగే 5 సంవత్సరాలు, 15 సంవత్సరాల వయస్సు పూర్తయిన పిల్లలకు బయోమెట్రిక్ వివరాలను తప్పనిసరిగా నవీకరించాలని, తల్లిదండ్రులు నిర్లక్ష్యం చేయకుండా సమీప ఆధార్ నమోదు కేంద్రంలో అప్‌డేట్ చేయించాలని సూచించారు. ఆధార్ నమోదు లేదా నవీకరణ కోసం సమీపంలోని ఆధార్ నమోదు కేంద్రాలు, పోస్టాఫీసులు, బ్యాంకులు లేదా ప్రభుత్వం గుర్తించిన సేవా కేంద్రాలను సంప్రదించాలని సూచించారు. అవసరమైన గుర్తింపు, చిరునామా ధ్రువీకరణ పత్రాలతో హాజరై వివరాలను నమోదు చేసుకోవాలని తెలిపారు. అలాగే ఆధార్‌కు సంబంధించిన వ్యక్తిగత వివరాలను అపరిచితులతో పంచుకోవద్దని, అధికారిక కేంద్రాల్లో మాత్రమే నమోదు, నవీకరణ సేవలను పొందాలని సూచించారు. జిల్లాలోని ప్రతి కుటుంబం ఆధార్ వివరాలను ఒకసారి పరిశీలించి అవసరమైన సవరణలు వెంటనే పూర్తి చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఈ-డిస్ట్రిక్ట్ మేనేజర్ సందీప్, మీ సేవ కేంద్రాల నిర్వాహకులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## తహసీల్దార్ కార్యాలయ భవన నిర్మాణానికి స్థల పరిశీలన



**ఇందల్వాయి, జూలై 27 (ప్రజాశంఖారావం):**

ఇందల్వాయి మండల తహసీల్దార్ కార్యాలయానికి శాశ్వత భవనం నిర్మించేందుకు ప్రభుత్వం చర్యలు వేగవంతం చేస్తోంది. ప్రస్తుతం కార్యాలయం అద్దె భవనంలో కొనసాగుతుండటంతో సొంత భవనం నిర్మాణం కోసం అధికారులు కసరత్తు ప్రారంభించారు. ఈ నేపథ్యంలో సోమవారం మండల తహసీల్దార్ బాలయ్య ప్రతిపాదిత స్థలాన్ని ప్రత్యక్షంగా పరిశీలించారు. భవన నిర్మాణానికి అనువైన స్థల ఎంపికలో భాగంగా స్థలం వివరాలు, నిర్మాణానికి అవసరమైన మౌలిక వసతులు, అనుకూల పరిస్థితులను పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ, స్థల పరిశీలనకు సంబంధించిన నివేదికను ప్రభుత్వానికి సమర్పించి, తహసీల్దార్ కార్యాలయ భవన నిర్మాణానికి సంబంధించిన తదుపరి ప్రక్రియను త్వరితగతిన చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల స్థాయి అధికారులు, రెవెన్యూ శాఖ సిబ్బంది, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## తక్కువ నీటి పంటలతో నష్టాల నివారణ




**ఇందల్వాయి, జూలై 27 (ప్రజాశంఖారావం):**

ఎల్‌నినో ప్రభావం, తక్కువ వర్షపాతం పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రైతులు తక్కువ నీటితో సాగయ్యే వర్షాధార పంటలను ఎంచుకోవాలని మండల వ్యవసాయ అధికారి శ్రీకాంత్ సూచించారు. సోమవారం ఇందల్వాయి మండల కేంద్రంలోని రైతు వేదికలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు, విత్తన మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా కందులు (రెడ్‌గ్రామ్), వివిధ రకాల కూరగాయల విత్తనాలను ప్రదర్శించి రైతులకు అందుబాటులో ఉంచారు. అనంతరం శ్రీకాంత్ మాట్లాడుతూ, వర్షాభావ పరిస్థితుల్లో కందులు, సజ్జలు, మొక్కజొన్న వంటి తక్కువ నీటి అవసరమున్న పంటలను సాగు చేస్తే నష్టాలను గణనీయంగా తగ్గించుకోవచ్చన్నారు. ప్రభుత్వ ధ్రువీకరించిన విత్తనాలనే కొనుగోలు చేయాలని, విత్తన ప్యాకెట్లపై ఉన్న వివరాలను పరిశీలించి తప్పనిసరిగా రసీదు తీసుకోవాలని రైతులకు సూచించారు. కూరగాయల సాగు చేపట్టడం ద్వారా కుటుంబ పోషకాహార భద్రతతో పాటు అదనపు ఆదాయం కూడా పొందవచ్చని పేర్కొన్నారు. స్థానిక పరిస్థితులకు అనుకూలమైన పంటలను ఎంపిక చేసుకుని ప్రభుత్వం నిర్వహిస్తున్న విత్తన మేళాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బంది, విత్తన విక్రేతలు, రైతులు పాల్గొని విత్తన ప్రదర్శనను పరిశీలించారు.

# బాధితులకు అండగా లయన్స్ క్లబ్




**చేగుంట, జూలై 27 (ప్రజాశంఖారావం):**

బాధితులు, పేదలకు అండగా నిలుస్తూ సమాజ సేవలో లయన్స్ క్లబ్ ఎల్లప్పుడూ ముందుంటుందని లయన్స్ కౌన్సిల్ చైర్‌పర్సన్ ఏ. అమర్‌నాథ్ రావు అన్నారు. మెదక్ జిల్లా చేగుంట మండల కేంద్రంలోని శ్రీ బాలాజీ ఫంక్షన్ హాల్‌లో సోమవారం లయన్స్ క్లబ్ ఆఫ్ చేగుంట-320డి 30వ ప్రమాణ స్వీకార మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన అమర్‌నాథ్ రావు మాట్లాడుతూ, ఎక్కడ సేవ అవసరమైతే అక్కడ లయన్స్ క్లబ్ స్పందిస్తుందని అన్నారు. విద్యార్థులకు ఆర్థిక సహాయం, వరద బాధితులకు సహాయక చర్యలు, ఆసుపత్రుల్లో ఐసీయూ పడకల ఏర్పాటు వంటి సేవా కార్యక్రమాలను సంస్థ నిరంతరం చేపడుతోందన్నారు. ఆర్థిక ఇబ్బందులతో చదువు ఆగిపోయిన ఓ విద్యార్థినికి బీఈడీ పూర్తి ఫీజు చెల్లించి ఉన్నత ఉద్యోగం సాధించేలా సహకరించిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు. అనంతరం నూతన అధ్యక్షుడు రజనకు రామచంద్రం మాట్లాడుతూ, సభ్యులందరినీ సమన్వయం చేసుకుంటూ సేవా కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ టీవీ చారి, కార్యదర్శి బుర్క నాగరాజు, కోశాధికారి దుర్గం అనిల్ కుమార్, మాజీ అధ్యక్షుడు శంబుని శ్రీనివాస్, ప్రత్యేక అతిథులు మర్రి ప్రవీణ్, రాం ఫణిధర్ రావు, డిస్ట్రిక్ట్ సెక్రటరీలు ద్యావ లింగమూర్తి, ఆకుల సుఖేందర్, జోన్ చైర్‌పర్సన్ గర్దాస్ మనోహర్, డిస్ట్రిక్ట్ చైర్‌పర్సన్లు ఒంటరి రామిరెడ్డి, స్వర్గం సిద్ధిరాములు, మంచికట్ల శ్రీనివాస్, దాసోజు వీరబ్రహ్మం, చౌదం నర్సింలు, పాల రామ్‌రెడ్డి, తుమ్మ శ్రీను, క్లబ్ సభ్యులు, స్థానిక ప్రముఖులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## విద్యార్థులకు మెడికల్ కిట్స్ పంపిణీ




**ఇందల్వాయి, జూలై 27 (ప్రజాశంఖారావం):**

విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణను దృష్టిలో ఉంచుకొని శ్రీకృష్ణ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పలు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ఉచితంగా మెడికల్ కిట్లను అందజేశారు. మండల పరిధిలోని ఇందల్వాయి, తీర్మాన్ పల్లి, నల్లవెల్లి మరియు సిర్నాపల్లి జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాలల్లో ఈ పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీకృష్ణ ఫౌండేషన్ చైర్మన్ బాలకృష్ణ మాట్లాడుతూ, విద్యార్థులు చదువుతో పాటు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలనే ఉద్దేశంతోనే ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంత విద్యార్థుల సంక్షేమానికి ఫౌండేషన్ ఎల్లప్పుడూ ముందుంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రతినిధులు నర్సోతం, ముత్యం నరేష్ , ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

## న్యావనంది జడ్పీహెచ్‌ఎస్‌లో బోనాల సందడి



**నిజామాబాద్ రూరల్ సిరికొండ, జూలై 28 (ప్రజాశంఖారావం):**

ఆషాఢ మాసాన్ని పురస్కరించుకుని న్యావనంది జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం బోనాల వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు బోనాలతో గ్రామంలో ఊరేగింపుగా వెళ్లి పోచమ్మ తల్లిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సంప్రదాయ నృత్యాలతో ఉత్సాహంగా పాఠశాలకు చేరుకుని వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు పొన్నాల తిరుపతి, గ్రామ సర్పంచ్ మామిడికింది దీప-నరేందర్, ఏఏపీసీ చైర్మన్ రాధ, ఉపసర్పంచ్ గంగాధర్, వీడీసీ సభ్యులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఆర్మూర్‌లో బీసీ బాలుర హాస్టల్ ఏర్పాటుకు ప్రతిపాదనలు

**ఆర్మూర్, జూలై 27 (ప్రజాశంఖారావం):**



ఆర్మూర్ నియోజకవర్గంలోని బీసీ విద్యార్థులకు శుభవార్తగా ప్రభుత్వ బీసీ బాలుర హాస్టల్ ఏర్పాటుకు పరిపాలనా ప్రతిపాదనలు సిద్ధమయ్యాయి. ఈ మేరకు కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రొద్దుటూరు వినయ్ కుమార్ రెడ్డి సోమవారం హైదరాబాద్‌లో రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసి ఆర్మూర్ జెడ్పీహెచ్‌ఎస్ బాలుర పాఠశాల ఆవరణలో ప్రభుత్వ బీసీ బాలుర హాస్టల్ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. మంత్రి సానుకూలంగా స్పందించడంతో సంబంధిత అధికారుల సమన్వయంతో ప్రతిపాదనలు ముందుకు సాగాయి. జిల్లా బీసీ అభివృద్ధి అధికారి బీసీ సంక్షేమ శాఖ కమిషనర్‌కు పంపిన ప్రతిపాదనల్లో ప్రస్తుతం పెర్కిట్‌లో కొనసాగుతున్న ప్రభుత్వ బీసీ బాలుర హాస్టల్‌ను రెండు హాస్టళ్లుగా విభజించి, ఆర్మూర్‌లో 200 మంది విద్యార్థుల సామర్థ్యంతో కొత్త హాస్టల్ ఏర్పాటు చేయాలని సూచించారు. అదేవిధంగా ప్రారంభ మౌలిక వసతులు, సిబ్బంది వేతనాల కోసం రూ.8,56,960 మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని కోరినట్లు తెలిపారు. హాస్టల్ ఏర్పాటు ద్వారా ఆర్మూర్, పరిసర ప్రాంతాల బీసీ విద్యార్థులకు నాణ్యమైన వసతి, విద్యా సౌకర్యాలు అందుబాటులోకి రావడంతో పాటు పేద విద్యార్థుల ఉన్నత విద్యకు మరింత ప్రోత్సాహం లభిస్తుందని వినయ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా సహకరించిన రాష్ట్ర ప్రభుత్వం, మంత్రి పొన్నం ప్రభాకర్, జిల్లా కలెక్టర్, బీసీ సంక్షేమ శాఖ అధికారులు, సంబంధిత ప్రజాప్రతినిధులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. హాస్టల్ ఏర్పాటు ప్రక్రియను త్వరగా పూర్తి చేసి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాలని ఆకాంక్షించారు.

## అంగన్‌వాడీ పోస్టుల భర్తీకి ధ్రువపత్రాల పరిశీలన

**మెదక్, జూలై 27 (ప్రజాశంఖారావం):**



మెదక్ ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో అంగన్‌వాడీ టీచర్, మినీ అంగన్‌వాడీ టీచర్, అంగన్‌వాడీ హెల్పర్ పోస్టుల భర్తీ ప్రక్రియలో భాగంగా అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలనకు షెడ్యూల్ విడుదలైంది. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు జూలై 29, 30 తేదీల్లో ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు మెదక్ ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో హాజరై అసలు ధ్రువపత్రాలను సమర్పించాలని సీడీపీఓ వెంకటరమణమ్మ సోమవారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. ధ్రువపత్రాల పరిశీలనలో భాగంగా జూలై 29న మెదక్-1 సూపర్వైజర్ పరిధి, జూలై 30న మెదక్-2 సూపర్వైజర్, మెదక్ అర్బన్ పరిధిలోని అంగన్‌వాడీ హెల్పర్ అభ్యర్థుల ధ్రువపత్రాలను పరిశీలించనున్నారు. అభ్యర్థులు ఎస్‌ఎస్‌సీ ఉత్తీర్ణత ధ్రువపత్రం, విద్యార్హతల అసలు సర్టిఫికెట్లు, నివాస ధ్రువీకరణ పత్రం, కుల ధ్రువీకరణ పత్రం (వర్తిస్తే), ఆధార్ కార్డు, ఇతర సంబంధిత ధ్రువపత్రాలను వెంట తీసుకురావాలని సూచించారు. నిర్దేశించిన తేదీ, సమయానికి అసలు ధ్రువపత్రాలతో హాజరుకాని అభ్యర్థులకు ఎంపిక ప్రక్రియలో ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందని సీడీపీఓ వెంకటరమణమ్మ హెచ్చరించారు.

## డ్రగ్స్, సైబర్ నేరాలపై విద్యార్థులకు పోలీసుల అవగాహన

**ఆర్మూర్, జూలై 25 (ప్రజాశంఖారావం):**

'మన ఊరు-మన భద్రత-మన బాధ్యత' కార్యక్రమంలో భాగంగా ఆర్మూర్ పట్టణంలోని బ్రిలియంట్ హైస్కూల్‌లో సోమవారం విద్యార్థులకు పోలీసులు అవగాహన సదస్సు నిర్వహించారు. సీఐ సత్యనారాయణ గౌడ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో విద్యార్థులకు డ్రగ్స్, సైబర్ నేరాలు, ట్రాఫిక్ నిబంధనలు, షీ టీమ్స్ సేవలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ యాసిర్ అర్ఫత్ మాట్లాడుతూ, విద్యార్థులు చదువుతో పాటు సమాజంలో చోటుచేసుకుంటున్న పరిణామాలపై అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. డ్రగ్స్, గంజాయి వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, వాటి రవాణా లేదా వినియోగంపై సమాచారం తెలిసినా వెంటనే పోలీసు లకు తెలియజేయాలని కోరారు. ఆన్‌లైన్ మోసాలు, అపరిచితుల ఫోన్ కాల్స్, ఓటీపీ వివరాల పంచుకోవడం, సామాజిక మాధ్యమా ల వినియోగంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మైనర్లు వాహనాలు నడపడం చట్టవిరుద్ధమని, ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని తెలిపారు. బాలికలు, మహిళల భద్రత కోసం తెలంగాణ పోలీసులు నిర్వహిస్తున్న షీ టీమ్స్ సేవలను వివరించిన ఆయన, వేధింపులు ఎదురైనప్పుడు భయపడకుండా వెంటనే పోలీసులను ఆశ్రయించాలని సూచించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రవికాంత్, ఉపాధ్యాయులు, పోలీసు సిబ్బంది, షీ టీమ్స్ సభ్యులు పాల్గొన్నారు.

# ఘనంగా నవనాథ సిద్ధేశ్వరునికి పల్లకీ సేవ

**ఆర్మూర్, జూలై 27 (ప్రజాశంఖారావం):**



ఆషాఢ మాసం రెండో సోమవారం సందర్భంగా ఆర్మూర్ పట్టణంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన నవనాథ సిద్ధుల గుట్ట భక్తజన సందోహంతో కళకళలాడింది. వేలాదిమంది భక్తులు విచ్చేసి నవనాథ సిద్ధేశ్వర స్వామికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. అనంతరం గుట్టపై ఉన్న అయ్యప్ప స్వామి, దుర్గాదేవి, శ్రీరామాలయం, ఆంజనేయ స్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి అశోక స్తంభాన్ని దర్శించుకున్నారు. శ్రీశ్రీశ్రీ నందీశ్వర మహారాజ్ ఆధ్వర్యంలో శ్రీరామాలయం నుంచి కోనేరు వరకు, అక్కడి నుంచి తిరిగి ఆలయం వరకు పల్లకి సేవను అంగరంగ వైభవంగా నిర్వహించారు. భక్తులు భజనలు, భక్తి గీతాలతో పాల్గొని ఆధ్యాత్మిక వాతావరణాన్ని సృష్టించారు. దాదాపు 10 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో దాతల సహకారంతో భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు బి. సుమన్, పీసీ గంగారెడ్డి, కోడిగల మల్లయ్య, చరణ్ రెడ్డి, కొంతం మంజుల-మురళీధర్, జిమ్మీ రవి-సంధ్య, బట్టు శంకర్, చందేసి శ్రీనివాస్, ప్రశాంత్ గౌడ్, హజారి సతీష్, బాషెట్టి నరేష్, రామా గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## కిడ్నీ బాధితురాలికి రూ.5 లక్షల ఎల్‌ఓసీ అందజేత



**ఇందల్వాయి, జూలై 27 (ప్రజాశంఖారావం):**

తీవ్ర కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న నల్లవెల్లి గ్రామానికి చెందిన కడుదురం లక్ష్మికి మెరుగైన వైద్య చికిత్స కోసం రూ.5 లక్షల విలువైన లెటర్ ఆఫ్ క్రెడిట్ (ఎల్‌ఓసీ)ను స్థానిక బీజేపీ నాయకులు అందజేశారు. బాధిత కుటుంబ పరిస్థితిని తెలుసుకున్న బీజేపీ నాయకులు స్పందించి, నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ సహకారంతో, బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్ కులచారి చొరవతో ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా రూ.5 లక్షల ఎల్‌ఓసీ మంజూరు చేయించి బాధిత కుటుంబానికి అందించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న పేద కుటుంబానికి వైద్య సహాయం అందేలా చర్యలు తీసుకున్న ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ, జిల్లా అధ్యక్షుడు దినేష్ కులచారికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కన్నె రాజేందర్, కిసాన్ మోర్చా మండల అధ్యక్షుడు నోముల శ్రీనివాస్ రెడ్డి, నాయకులు శ్రీకాంత్, రాజేందర్, జనార్ధన్, మల్లేశ్, దిలీప్, చింతలపల్లి రమేష్ రెడ్డి, గురుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల కష్టాలు తీరుస్తున్న కౌన్సిలర్

**ఆర్మూర్ జూలై 27(ప్రజా శంఖారావం):**

విద్యార్థుల కష్టాలు తీరుస్తున్న కౌన్సిలర్ ఖాందేష్ ప్రశాంత్. ఆర్మూర్ మున్సిపల్ పట్టణ కేంద్రంలోని ఏడవ వార్డు కౌన్సిలర్ ఆయన వార్డులో గల మోడల్ స్కూల్, కేజీబీవీ, మైనారిటీ స్కూల్లల్లో పిల్లలకు ఇబ్బంది కలుగుతుందని ఆయా పాఠశాలల ప్రిన్సిపల్ సమాచారంతో మోడల్ స్కూల్ గేట్ ముందర, లోపల వర్షం నీరు నిండిపోయి పిల్లలకు రాకపోకలకు ఇబ్బంది కలుగుతుందని తెలపడంతో మొరం పోయించారు. దోమల నివారణ కోసం ఫాగింగ్ చేయించారు.